S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుక.. మన పత్రిక — తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 129 | ఎడిటర్ : విక్రం కుమార్ | మంగళవారం 10 మార్చి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

## గల్ఫ్‌లోని భారతీయుల భద్రతకు ప్రాధాన్యం



- వార్ జోన్ నుంచి 67వేల మందిని తరలించాం
- ప్రస్తుతం రోజూ 50 విమానాలు నడుపుతున్నం
- ఇరాన్ వెళ్లొద్దని జనవరిలోనే చెప్పాం
- యుద్ధ ఉద్రిక్తతలు తగ్గాలి.. దౌత్యంతోనే పరిష్కారం
- ఇంధన భద్రతపై కేంద్రం అప్రమత్తం
- ఉభయ సభల్లో విదేశాంగమంత్రి ఎస్ జై శంకర్

4

## లోక్‌సభలో గందరగోళం

4



- చైర్మన్ నిరాకరణతో వెల్‌లోకి దూసుకెళ్లి నిరసనలు
- సభ నేటికి వాయిదా



### తెలంగాణ వేదికగా అంతర్జాతీయ క్రీడల నిర్వహణే ధ్యేయం

## ఒలింపిక్స్ లక్ష్యంగా

# ‘స్పోర్ట్స్ వర్సిటీ’

### స్టేడియాల ఆధునీకరణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం




**హైదరాబాద్, మార్చి 9:** తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ క్రీడా హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. భవిష్యత్తులో ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం క్రీడాశాఖపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ‘యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ’ డిజైన్లను పరిశీలించిన ఆయన, క్రీడాకారుల శిక్షణ మరియు మౌలిక సదుపాయాల కల్పనపై కీలక దిశానిర్దేశం చేశారు.

మిగతా 2 లో

## ప్రజాసేవలో ఎప్పుడూ పోలీసులే ముందు

- నేరాల తీరుకు అనుగుణంగా పనితీరు మార్చుకోవాలి
- పోలీస్ ఆఫీసర్స్ రీట్రీట్‌లో సీఎం



## అంతుచిక్కని వైరస్

- తెలంగాణలో కోళ్ల మరణాల నేపథ్యంలో సరిహద్దు జిల్లాల్లో హై అలర్ట్
- వేల సంఖ్యలో కోళ్ల మృతి

2



## లిక్కర్ కన్నా సారాయే బెటర్

- గతంలో లాగా సారా దుకాణాలు తెరవాలి
- జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

2

## గణపతి ఎక్కడ?

- నేపాల్‌పై నిఘా వర్గాల దృష్టి
- మావోయిస్టు మాజీ అగ్రనేత కోసం పోలీసుల ముమ్మర వేట
- లొంగిపోతే మెరుగైన వైద్యం, పునరావాసం కల్పిస్తామన్న ప్రభుత్వం

2





2

## విద్యుదాఘాతం

### ఇద్దరు యువకుల దుర్మరణం

- ఒకరు సజీవ దహనం.. మరొకరు అక్కడికక్కడే మృతి
- ఇనుప స్టాండ్‌ను కదుపుతుండగా ప్రమాదం

## భూములకు భరోసా రైతులకు భద్రత



- సీమను ‘హార్టికల్చర్ హబ్’గా మారుస్తా
- కరెంట్ ఛార్జీలు పెంచే ప్రసక్తే లేదు
- కర్నూలులో ‘డ్రోన్ సిటీ’.. అనంతలో ‘ఎయిరో స్పేస్’
- పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

2

## చావుకు భయపడి లొంగిపోలేదు

- చట్టం పరిధిలోనే ప్రజా సమస్యలపై పోరాటం
- మాజీ మావోయిస్టు నేత ఆశన్న

2





2

## శ్రీవారి లడ్డూ ప్రసాదాలకు నెయ్యి కొరత లేదు

- అసత్య ప్రచారాలను నమ్మవద్దు.. • టీటీడీ స్పష్టత



## ఇరాన్ సుప్రీం లీడర్‌గా మొజ్తబా ఖమేనీ

సోషల్ మీడియాలో నిపుణుల కమిటీ ప్రకటన

ఇస్లామిక్ రిపబ్లిక్ మూడో సుప్రీం లీడర్ ఈయన

4

## మొజ్తబా లైట్‌వెయిట్

సుప్రీం ఎంపికలో అమెరికా పాత్ర ఉండాలి..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

4

ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయనను ‘లైట్‌వెయిట్’ అని పేర్కొన్నారు. ఇరాన్‌కు శాంతి, సామరస్యాన్ని తీసుకువచ్చే నాయకుడు కావాలని ట్రంప్ అన్నారు.





# విద్యుదాఘాతం

## ఇద్దరు యువకుల దుర్మరణం

**ఒకరు సజీవ దహనం.. మరొకరు అక్కడికక్కడే మృతి**

**పెట్రోల్ బంక్ వద్ద ఇనుప స్టాండ్‌ను కదుపుతుండగా ప్రమాదం**

**దండేపల్లి, మార్చి 9:** మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం మ్యాదరిపేటలో సోమవారం ఘోర విషాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు విద్యుత్ మెయిన్ లైన్ తగిలి ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. కళ్లెదుటే జరిగిన ఈ హృదయ విదారక ఘటన స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మ్యాదరిపేటలోని ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో ఒక భారీ ఇనుప స్టాండ్‌ను కదుపుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆ స్టాండ్‌ను రోడ్డుపై నుంచి జరుపుతున్న క్రమంలో, అది పైన తక్కువ ఎత్తులో వేలాడుతున్న హై ఓల్టేజ్ విద్యుత్ మెయిన్ లైన్‌కు తగిలింది. దీంతో ఒక్కసారిగా ఆ ఇనుప స్టాండ్‌లోకి భారీగా విద్యుత్ ప్రవహించింది. విద్యుత్ ధాటికి స్టాండ్‌ను పట్టుకున్న మ్యాదరిపేట గ్రామానికి చెందిన సల్ల లక్ష్మీనారాయణ (ఎడ్డన్న), వెల్గనూర్ గ్రామానికి చెందిన చందనగిరి నాగరాజులకు తీవ్రగా షాక్ తగిలింది. విద్యుత్ ప్రవాహ తీవ్రతకు లక్ష్మీనారాయణ ఒళ్లు మంటలకు ఆహుతై సజీవ దహనం కాగా, నాగరాజు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. చేతికొచ్చిన యువకులు కరెంట్ కాటుకు బలవడంతో మ్యాదరిపేట, వెల్గనూర్ గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు స్థానికులను కలచివేశాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. విద్యుత్ అధికారుల అజాగ్రత్త వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకోండి

**సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ**



**ఢిల్లీ:** సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టుపై కీలక సూచనలు చేశారు. సెకండ్ ఫేజ్‌లో భాగంగా ఎన్టీపీ సీ రామగుండంలో ఏర్పాటు చేయసున్న 3x800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టుతో తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు ఒప్పందం(పీపీఏ) చేసుకోవాలని సూచించారు. పూర్తి 5x800 మెగావాట్ల ప్రాజెక్టుకు అవసరమైన బొగ్గును సమీకరించుకోవడంలో ఎన్టీపీసీకి తగిన స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు. మొదటి ఫేజ్‌లో లాగే సెకండ్ ఫేజ్‌లోనూ ఉత్పత్తి చేసే విద్యుత్లో 85% రాష్ట్రానికి మాత్రమే సరఫరా చేయనుందని తెలిపారు. రానున్న రోజుల్లో పవర్ డిమాండ్ మరింతగా పెరగనున్న ఈ నేపథ్యంలో ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అతి తక్కువ ఖర్చుతో, అధునాతన అల్ట్రా సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో థర్మల్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయడంలో ఎన్టీపీసీకి దేశంలోనే విశేషమైన అనుభవం ఉందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# గణపతి ఎక్కడ?

**హైదరాబాద్, మార్చి 9:** దేశంలో మావోయిస్టు ఉద్యమానికి సుదీర్ఘకాలం పాటు నేతృత్వం వహించిన ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి ఆచూకీపై నిఘా వర్గాలు మళ్లీ దృష్టి సారించాయి. గత నాలుగున్నర దశాబ్దాల పాటు పార్టీ కార్యదర్శిగా పనిచేసి, 2018లో వృద్ధాప్యం మరియు అనారోగ్య కారణాలతో బాధ్యతల నుంచి వైదొలిగిన గణపతి, ప్రస్తుతం నేపాల్‌లో తలదాచుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల లొంగిపోయిన కొందరు కీలక నేతలు ఇచ్చిన సమాచారం మేరకు తెలంగాణ పోలీసులు నేపాల్ సరిహద్దుల్లో గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. గణపతి లొంగిపోవాలని గతంలోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా మరియు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆయన గనుక జనజీవన స్రవంతిలోకి వస్తే ప్రభుత్వం తరఫున భారీ పునరావాస ప్యాకేజీతో పాటు, వయస్సు రీత్యా ఆయనకు అవసరమైన అత్యాధునిక వైద్య సేవలు మరియు ఆరోగ్య భద్రత కల్పిస్తామని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే భరోసా ఇచ్చింది. ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న గణపతి ఆరోగ్యం క్షీణించిందని సమాచారం అందుతుండటంతో, పోలీసులు ఆయన కుటుంబ సభ్యుల ద్వారా లేదా ఇతర మాజీ సభ్యుల ద్వారా లొంగిబాటు దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. మావోయిస్టు ఉద్యమంలో అత్యంత ప్రభావవంతమైన నేతగా ఉన్న గణపతి పట్టుబడితే లేదా లొంగిపోతే అది ఉద్యమానికి పెద్ద ఎదురుదెబ్బగా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# లిక్కర్ కన్నా సారాయే బెటర్

**గతంలో లాగా సారా దుకాణాలు తెరవాలి**

**జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

**హైదరాబాద్, మార్చి 9:** జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సోమవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో బాంబు పేలుస్తానని అన్నారు. సచివాలయం ఎదుట మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో సారా దుకాణాలు ఓపెన్ చేయాలని అసెంబ్లీ సమావేశాల్లో కోరుతానని అన్నారు. గతంలో సారా తాగిన వారంతా ఆరోగ్యంగా ఉన్నారని అన్నారు. సారా తాగి 115 సంవత్సరాల పాటు బ్రతికిన జనం, ఇప్పుడు లిక్కర్ తాగి 80 ఏళ్లకే చనిపోతు న్నారని పేర్కొన్నారు. సైంటిఫిక్ గా సారా ఆరోగ్యానికి హానికరం కాదని, ఇటీవల కొన్ని రాష్టాలు సారా దుకాణాలు ప్రారంభించారని గుర్తు చేశారు. మధ్యప్రదేశ్, ఒడిస్సా రాష్ట్రాలలో ప్రభుత్వాలు అధికారికంగా సారా దుకాణాలను నడుపుతున్నారని వివరించారు. వచ్చే బ్జడెట్ అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్లో సారా దుకాణాల అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తానని స్పష్టం చేశారు.

# ప్రజాసేవలో పోలీసులే ముందు

- సాయం కోసం ప్రజలు పోలీసుల వైపే చూస్తారు
- ప్రజలకు మీరున్నారనే ధైర్యం ఇందుకు కారణం
- నేరాల తీరుకు అనుగుణంగా పనితీరు మార్చుకోవాలి
- పోలీస్ ఆఫీసర్స్ రీట్రీట్‌లో సీఎం



**హైదరాబాద్, మార్చి 9:** మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల స్వరూపం మారుతోందని, దానికి తగ్గట్టుగా పోలీస్ వ్యవస్థ తన పనితీరును మెరుగుపరుచుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణ పోలీస్ అకాడమీలో నిర్వహించిన 'తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్-2026' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసుల సేవలను అభినందిస్తూనే, భవిష్యత్తు సవాళ్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఒకప్పుడు తీవ్రవాదం ఒక ప్రధాన సమస్యగా ఉండేదని, దానిని ఎదుర్కోవడానికి గ్రేహౌండ్స్, ఆక్టోపస్ వంటి ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నామని సీఎం గుర్తుచేశారు. ప్రస్తుతం ఫిజికల్ క్రైమ్ కంటే సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, మన సిస్టమ్‌ను అప్‌గ్రేడ్ చేసుకోకపోతే ఈ నేరాలను అదుపు చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. సాంకేతిక నైపుణ్యం ఉన్న అధికారులను నియమించుకోవడంతో పాటు ఉన్న సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు. పోలీస్ శాఖలో ఇతర శాఖల్లా 'ఆటో మోడ్' లేదా 'ఆటో ప్రమోషన్' ఉండకూడదని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతిభద్రతలు అత్యంత కీలకమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047' పాలసీ డాక్యుమెంట్ ద్వారా 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వివరించారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న 2100 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్‌గా పరిగణించి పెట్టుబడులను ఆకర్షిస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీలో కాలుష్యం, బెంగళూరులో ట్రాఫిక్, ముంబైలో వరదలు వంటి సమస్యల నుంచి మనం గుణపాఠం నేర్చుకోవాలని అధికారులకు సూచించారు. రిట్రీట్ కార్యక్రమంలో అధికారులు అందించిన సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, రిక్రూట్‌మెంట్ వంటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ కమిటీ అధికారుల ప్రతిపాదనలను విశ్లేషించి, చట్టం రూపంలో ప్రభుత్వానికి నివేదిస్తుందని తెలిపారు. పోలీస్ శాఖలో జనాభా ప్రాతిపదికన సిబ్బంది రేషనలైజేషన్ జరగాలని, వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపం ఉండకూడదని ఆదేశించారు. ప్రతి ఏటా డిసెంబరులో రిట్రీట్ కార్యక్రమాన్ని నిర్వహించాలని, దీనివల్ల బడ్జెట్ ప్రవేశపెట్టకముందే పోలీస్ శాఖకు అవసరమైన నిధులను కేటాయించడానికి వీలవుతుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# ఒలింపిక్స్ లక్ష్యంగా 'స్పోర్ట్స్ వర్సిటీ'

మొదటి పేజీ తరువాయి

గచ్చిబౌలి స్టేడియం ఆవరణలో నిర్మించనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీలో ఇండోర్ స్టేడియం, వర్సిటీ కాంప్లెక్స్, అత్యాధునిక హాస్టల్ భవనాలతో పాటు అన్ని రకాల క్రీడలకు అవసరమైన మైదానాలను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. "ఒలింపిక్స్‌లో మన క్రీడాకారులు సత్తా చాటడమే లక్ష్యంగా శిక్షణ ఉండాలి. దానికి అవసరమైన ప్రతి సౌకర్యం ఈ యూనివర్సిటీలో ఉండాలి" అని ఆయన స్పష్టం చేశారు. వర్సిటీ నిర్మాణానికి సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించి, అధికారులకు అవసరమైన మార్పులను సూచించారు. నగరంలోని కీలక క్రీడా ప్రాంగణాలకు పూర్వవైభవం తీసుకురావాలని ఆదేశించారు. గచ్చిబౌలి ఔట్‌డోర్ స్టేడియంతో పాటు కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్ నగర్ స్టేడియాలను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఆధునీకరించాలని చెప్పారు. క్రీడాకారుల శిక్షణకు, అంతర్జాతీయ పోటీల నిర్వహణకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా స్టేడియాలను తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, శాప్ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి. కిషోర్ మరియు ఇతర ఉన్నతాధికారులు హాజరై క్రీడా రంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తెలంగాణ క్రీడాకారులు ప్రపంచ వేదికలపై భారత పతాకాన్ని రెపరెపలాడించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని సీఎం ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# లిక్కర్ స్కామ్ కేసులో ట్విస్ట్

**కవిత సహా 23 మందికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు!**

- సీబీఐ తరఫున ఏఎస్జీ తుషార్ మెహతా వాదనలు
- ప్రతివాదుల తరఫున హాజరు కాని లాయర్లు
- కౌంటర్ దాఖలు చేయాలన్న న్యాయస్థానం




**ఢిల్లీ, మార్చి 9:** ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆమెతో పాటు అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా సహా మొత్తం 23 మంది ప్రతివాదులకు కూడా నోటీసులు ఇచ్చింది. సీబీఐ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ కేసు విచారణను మార్చి 16కు వాయిదా వేసింది. ఇటీవల రౌస్ ఎవెన్యూ కోర్టు ఈ కేసులో కీలక తీర్పు ఇచ్చింది. ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, బీఆర్ఎస్ నేత కే కవిత సహా 23 మందికి స్పెషల్ జడ్జి జితేంద్ర సింగ్ క్లీన్ చిట్ ఇచ్చారు. ఈ తీర్పుతో కేసులో ఉన్న ఆరోపణలు నిలబడవని ట్రయల్ కోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. అయితే ఈ నిర్ణయాన్ని సీబీఐ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసింది. సోమవారం జరిగిన విచారణలో సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. లిక్కర్ పాలసీ కేసులో కీలక పాత్రలు ఉన్న వ్యక్తులపై స్పెషల్ కోర్టు సరైన విధంగా పరిశీలన చేయలేదని ఆయన కోర్టుకు తెలిపారు. ముఖ్యంగా కేజ్రీవాల్, సిసోడియా, కవిత పాత్రలను అంచనా వేయడంలో ట్రయల్ కోర్టు పొరపాట్లు చేసిందని పేర్కొన్నారు. మద్యం పాలసీ వెనుక పెద్ద కుట్ర ఉందని సీబీఐ వాదించింది. కానీ ట్రయల్ కోర్టు మొత్తం వ్యవహారాన్ని విడివిడిగా చూసి నిర్ణయం తీసుకోవడం వల్ల కేసు బలహీనపడిందని అభిప్రాయం వ్యక్తం చేసింది. అందువల్ల ట్రయల్ కోర్టు ఆదేశాలపై స్టే ఇవ్వాలని కోర్టును కోరింది. ఈ వాదనలను పరిశీలించిన ఢిల్లీ హైకోర్టు ట్రయల్ కోర్టు సీబీఐపై చేసిన వ్యాఖ్యలపై స్టే విధించింది. అలాగే ఈ పిటిషన్‌పై విచారణ పూర్తయ్యే వరకు ఈడీ కేసులో ట్రయల్‌ను కూడా వాయిదా వేయాలని ట్రయల్ కోర్టుకు ఆదేశించింది. ఈ సందర్భంగా కవిత అంశం మరోసారి చర్చకు వచ్చింది. లిక్కర్ పాలసీ వ్యవహారంలో ఆమె పాత్రపై సీబీఐ ప్రత్యేకంగా విచారణ జరిపిందని కోర్టులో ప్రస్తావించింది. ట్రయల్ కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిన నేపథ్యంలో ఇప్పుడు హైకోర్టు విచారణపై అందరి దృష్టి పడింది. ఇక కవిత సహా 23 మంది ప్రతివాదులు సీబీఐ పిటిషన్‌కు తమ సమాధానాలు దాఖలు చేయాల్సి ఉంది. ఈ కేసులో తదుపరి పరిణామాలు మార్చి 16న జరిగే విచారణలో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# చావుకు భయపడి లొంగిపోలేదు

- చట్టం పరిధిలోనే ప్రజా సమస్యలపై పోరాటం
- కొత్తదారి వెతుకులాటలో ఉన్నాం'
- మాజీ మావోయిస్టు నేత ఆశన్న
- బట్టుపల్లిలో అమరుల కుటుంబాలతో భేటీ



**హన్మకొండ, మార్చి 9 :** "మేము మరణానికి భయపడే వ్యక్తులం కాదు. చావుకు భయపడి లొంగిపోయామని జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదు. సమాజంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా, చట్టం పరిధిలో ఉండి పనిచేయాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని మావోయిస్టు పార్టీ మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కలపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న స్పష్టం చేశారు. సోమవారం హన్మకొండ జిల్లా ఖాజీపేట మండలం బట్టుపల్లి గ్రామంలో మాజీ మావోయిస్టులు, అమరుల కుటుంబాలను ఆయన కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆశన్న మాట్లాడుతూ.. మూడున్నర దశాబ్దాల పాటు దండకారణ్యంలో ఆదివాసీల హక్కుల కోసం, నిర్బంధాల మధ్య పనిచేశామని గుర్తు చేసుకున్నారు. "ప్రస్తుతం సమాజంలో పరిస్థితులు మారాయి. ఆ మార్పులకు అనుగుణంగానే పోరాడాలని కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరోలో చర్చించిన తర్వాతే బయటకు వచ్చే నిర్ణయం తీసుకున్నాం. అన్నీ ఆలోచించే ఈ అడుగు వేశాం" అని వివరించారు. లొంగుబాటుపై సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలను ఆయన కొట్టిపారేశారు.

### కొత్త దారి వెతుకులాటలో..

ప్రస్తుతానికి తాము ఏ రాజకీయ పార్టీలో చేరాలనే ఆలోచనలో లేమని ఆశన్న స్పష్టం చేశారు. "సమాజంలో ఇంకా అనేక సమస్యలు ఉన్నాయి. వాటి పరిష్కారం కోసం ఒక వర్గానికో, కులానికో పరిమితం కాకుండా అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తాం. పదేళ్ల క్రితం పార్టీ బలంగా ఉన్నప్పుడే ప్రభుత్వాలతో చర్చలు జరిపి ఉంటే ఇంతమంది అమరులయ్యేవారు కాదు. ఇప్పుడున్న ప్రతికూల పరిస్థితుల్లో కొత్త దారి వెతుకులాటలో ఉన్నాం" అని పేర్కొన్నారు. తాము ఎక్కడికీ పారిపోమని, ప్రజల మధ్యే ఉండి పనిచేస్తామని భరోసా ఇచ్చారు. తన విప్లవ ప్రయాణం బట్టుపల్లి నుంచే మొదలైందని, ఈ గ్రామంతో తనకు విడదీయని అనుబంధం ఉందని ఆశన్న భావోద్వేగానికి లోనయ్యారు. తన ప్రయాణంలో అండగా నిలిచిన గ్రామస్థులకు ధన్యవాదాలు తెలిపారు. ఆశన్న వెంట పవనానందరెడ్డి (శ్యామ్ దాదా), యాదగిరి (రాజ్మన్), పద్మ, వనిత తదితరులు ఉన్నారు. కాగా, మాజీ మావోయిస్టు నేతలు బట్టుపల్లి గ్రామంలో అమరుల కుటుంబాలను కలవడంపై నిఘా వర్గాలు దృష్టి సారించాయి. ఉన్నతాధికారులు స్వయంగా అక్కడికి చేరుకుని వివరాలు సేకరించడం చర్చనీయాంశంగా మారింది.



# తిరుపతి జిల్లాలో విషాద ఘటన

## కరెంట్ తీగలకు రెండు ఏనుగులు బలి

**తిరుపతి,మార్చి 9:** జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఎర్రావారి పాలెం మండలంలోని నెరబైలు అడవికి సమీపంలో వేటగాళ్లు వేసిన కరెంట్ ఉచ్చులో చిక్కి రెండు ఏనుగులు మృతిచెందాయి. ఈ ఘటన సోమవారం ఉదయం వెలుగులోకి రావడంతో స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం, ఎర్రావారి పాలెం మండలం నెరబైలు అడవికి సమీపంలోని సాయిబులపల్లె ప్రాంతంలో వేటగాళ్లు అక్రమంగా కరెంట్ ఉచ్చులు వేశారు. అడవిలో నుంచి మేత కోసం పొలాల వైపు వచ్చిన రెండు గజరాజులు ఆ కరెంట్ ఉచ్చులో చిక్కి తీవ్ర షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలుస్తోంది. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వేటగాళ్లు ఉద్దేశపూర్వకంగా కరెంట్ ఉచ్చు పెట్టడం వల్లనే ఈ ఘటన జరిగి ఉండవచ్చని అటవీ శాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఈ ఘటనకు కారణమైన వేటగాళ్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ అధికారులు వెల్లడించారు.

# ఆర్థిక సంక్షభంతో తగ్గుతున్న పసిడిధరలు

## బంగారం, వెండిపై స్వల్పంగా తగ్గుదల



**న్యూఢిల్లీ, మార్చి 9:** గత కొద్ది రోజులుగా తగ్గుతూ వస్తున్న బంగారం, వెండి ధరలు సోమవారం మరింత కిందకు వచ్చాయి. అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ బంగారం, వెండి ధరలు మాత్రం పడిపోతుండడం నిపుణులకు ఆశ్చర్యం కలిగిస్తోంది. సోమవారం వెండి కేజీకి రూ.5 వేల మేర తగ్గింది. మరోవైపు బంగారం ధర కూడా భారీగా తగ్గింది. సోమవారంఉదయం 10:30 గంటల సమయంలో హైదారాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,61,680కు చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే దాదాపు రూ.1960 మేర తగ్గుదల నమోదు చేసింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,200 దగ్గర ఉంది. ముందటి రోజు ధరతో పోల్చుకుంటే రూ.1800 మేర తగ్గింది. మరోవైపు వెండి కూడా భారీ తగ్గుదల నమోదు చేసింది. బుధవారం కిలోకు రూ.5 వేల మేర తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.80 లక్షలుగా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.90 లక్షలుగా ఉంది. గమనిక: పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే సమయంలో మళ్లీ ధరలు తెలుసుకోవాలని సూచన.

# లెబనాన్‌లో ఇండ్లపై వైట్ ఫాస్ఫరస్

## దక్షిణ లెబనాన్లోని యోహ్మోర్ లో ఘటన

## కనీసం రెండు ఇళ్లల్లో అగ్ని ప్రమాదాలు

## హ్యూమన్ రైట్స్ వాచ్ సీరియస్

**టెహ్రాన్:** దక్షిణ లెబనాన్‌లోని నివాస ప్రాంతాలపై ఇజ్రాయెల్ తెల్ల ఫాస్ఫరస్ ఆయుధాలను వినియోగించినట్లు మానవ హక్కుల సంస్థ హ్యూమన్ రైట్స్ వాచ్ ఆరోపించింది. ఈ నెల 3న లెబనాన్ లోని యోహ్మోర్ ప్రాంతంపై తెల్ల ఫాస్ఫరస్ గోలాలు ప్రయోగించినట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపింది. ఈ ఘటనకు సంబంధించిన ఏడు ఫొటోల నిజానిజాలను తమ పరిశోధ నలో ధ్రువీకరించినట్లు వెల్లడించింది. ఆ చిత్రా ల్లోనివాస ప్రాంతం మీద తెల్ల ఫాస్ఫరస్ గోలాలు పడటం, కనీసం రెండు ఇళ్లలో మంటలు చెలరే గిన దృశ్యాలు కనిపిస్తున్నాయని తెలిపింది. ఈ విషయంపై హ్యూమన్ రైట్స్ వాచ్కు చెందిన లెబనాన్ పరిశోధకుడు రామ్ కైస్ స్పందిస్తూ, నివాస ప్రాంతాలపై ఇలాంటి ఆయుధాలను వినియోగించడం అత్యంత ఆందోళనకరమ ని అన్నారు. తెల్ల ఫాస్ఫరస్ వల్ల కలిగే అగ్ని ప్రభావం తీవ్రమైన గాయాలు, మరణాలకు దారితీసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ రసాయన ఆయుధం కారణంగా బాధితులు జీవితాంతం తీవ్ర నొప్పి, బాధలు అనుభవించే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.



# వెలుగులోకి సింథటిక్ డ్రగ్స్


## ఈగిల్ ఫోర్స్ దాడుల్లో వెలుగులోకి సంచలన విషయాలు



**హైదాబాద్, మార్చి 9:** తెలంగాణలో భారీ సింథటిక్ డ్రగ్స్ రాకెట్‌ను పోలీసులు వెలుగులోకి తెచ్చారు. షాద్‌నగర్‌లో రహస్యంగా మెఫెడ్రోన్ డ్రగ్ తయారీ చేస్తున్న గ్యాంగ్ కార్యకలాపాలను ఈగిల్ ఫోర్స్ దర్యాప్తులో గుర్తించారు. ఈ కేసులో సంచలన విషయాలు బయటపడటంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. దర్యాప్తులో భాగంగా ఎస్సార్ ఇన్నోవేషన్స్ అనే సంస్థ ద్వారా డ్రగ్స్ తయారీలో ఉపయోగించే నిషేధిత రసాయనాలను సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా మెఫెడ్రోన్ తయారీలో ఉపయోగించే 2 బ్రోమో–4 మెథైల్ ప్రొపియోఫినోన్ అనే రసాయనంతో పాటు, క్లోఫెడ్రోన్ తయారీలో ఉపయోగించే 3 క్లోరో–1 ఫెనైల్–1 ప్రోపనోన్ అనే కెమికల్స్‌ను సరఫరా చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ఎస్సార్ ఇన్నోవేషన్స్ డైరెక్టర్ షేక్ రఫీ కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. ఇండియా మార్ట్ ద్వారా రాజస్థాన్‌కు చెందిన నిందితులకు ఈ రసాయనాలను సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. రాజస్థాన్‌కు చెందిన గ్యాంగ్ మూడు విడతల్లో దాదాపు 300 కిలోల రసాయనాలను కొనుగోలు చేసినట్లు సమాచారం. నిందితులు తప్పుడు కంపెనీ పేర్లతో కెమికల్స్ కొనుగోలు చేసి షాద్‌నగర్‌లో అ÷–దదె గదిని తీసుకుని అక్కడే డ్రగ్స్ తయారీ చేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. తయారు చేసిన డ్రగ్స్‌ను తిరిగి రాజస్థాన్‌కు తరలించి విక్రయిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ గ్యాంగ్‌కు రాజస్థాన్‌కు చెందిన గిరీష్ థాపర్ అలియాస్ వీరేంద్ర స్వామి నాయకత్వం వహిస్తున్నాడు. నకిలీ పేర్లతో వ్యవహరిస్తూ డ్రగ్స్ తయారీకి అవసరమైన ముడి సరుకును సేకరించినట్లు పోలీసులు గుర్తించారు. గ్యాంగ్‌లో మనీష్ బిష్ణోయి, మనోజ్ మాథూర్, శిశుపాల్, సుమిత్, రాజు కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. ఈ కెమికల్స్ సరఫరాకు సంబంధించి లక్షల రూపాయల లావాదేవీలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈగిల్ పోలీసుల సమాచారంతో రాజస్థాన్ పోలీసులు వీరేంద్ర స్వామి, మనీష్ బిష్ణోయిని అదుపులోకి తీసుకున్నారు. వారి విచారణలో షాద్‌నగర్‌లో నడుస్తున్న డ్రగ్ ల్యాబ్ విషయం బయటపడింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నార్కోటిక్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల కేసు నమోదు చేశారు. పోలీసులు మరికొంతమంది నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

# డిజిటల్ అరెస్ట్ పేరుతో రిటైర్డ్ జడ్జికి 1.66 కోట్ల మోసం

- మనీ లాండరింగ్, మానవ అక్రమ రవాణా కేసుల పేరుతో టార్గెట్
- వీడియో కాల్ చేసి తాము సీబీఐ అధికారులమని బెదిరింపులు
- ఇంటి నుంచి బయటకు రావొద్దంటూ 'డిజిటల్ అరెస్ట్'
- ప్రతిష్ట దెబ్బతింటుందని భయపెట్టి మనీ ట్రాన్స్ ఫర్
- నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు



**హైదరాబాద్:** రిటైర్డ్ జడ్జిని లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు 'డిజిటల్ అరెస్ట్' పేరుతో భారీ మోసానికి పాల్పడ్డారు. మనీ లాండరింగ్, మానవ అక్రమ రవాణా కేసుల్లో మీపై కేసులు ఉన్నాయని చెప్పి బెదిరించి మొత్తం రూ.1.66 కోట్లు దోచుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసు కథనం ప్రకారం.. సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ చేసి తాము సీబీఐ అధికారు లు అంటూ బాధితుడిని భయపెట్టారు. మీ ఆధారు అనుసంధానమైన రెండు మె–ుబైల్ నంబర్ల నుంచి మహిళలకు అభ్యంతరకర కాల్స్ వెళ్తున్నాయని, ఈ వ్యవహారంపై బెంగళూరులోని ఇందిరానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని చెప్పారు. అదేసమయంలో మానవ అక్రమ రవాణా కేసులో సుప్రీంకోర్టు నాన్బెయిలబుల్ వారెంట్ జారీ అయిందని కూడా నమ్మబలికారు. ఈ కేసు విచారణ జరుగుతున్నందున ఇంటి నుంచి బయటకు రావొద్దని, ఎవరికీ చెప్పొద్దని 'డిజిటల్ అరెస్ట్' పేరుతో ఆంక్షలు విధించారు. బ్యాంక్ ఖాతా వివరాలు ఇవ్వాలని ఒత్తిడి చేసి, విచారణ పూర్తయిన తర్వాత డబ్బు తిరిగి ఇస్తామని నమ్మిం చారు. అరెస్టు అయితే ప్రతిష్ట దెబ్బతింటుం దనే భయంతో రిటైర్డ్ జడ్జి మొత్తం రూ.1.66 కోట్లు వారి ఖాతాలకు బదిలీ చేశారు. తర్వాత డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయి నట్లు గుర్తించిన బాధితుడు పోలీసులను ఆశ్ర యించారు. దీనిపై నేరేడు మెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# లోక్‌సభలో గందరగోళం

## దక్షిణాసియా యుద్ధంపై చర్చకు విపక్షాల పట్టు

## చైర్మన్ నిరాకరణతో వెల్‌లోకి దూసుకెళ్లి నిరసనలు

## సభ నేటికి వాయిదా



**ఢిల్లీ:** అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు సంయుక్తంగా ఇరాన్ దేశంపై దాడి చేయడంతో మిడిల్ ఈస్ట్ కంట్రీస్‌లో ఆందోళనకరమైన వాతావరణం నెలకొంది. ముఖ్యంగా ఇరాన్ ప్రతికార దాడులను అరబ్ కంట్రీస్ పై చేయడంతో ప్రపంచ వ్యాప్త వాణిజ్యంపై ప్రభావం చూపుతుంది. ఈ యుద్ధం ప్రభావం ప్రస్తుతం భారత బడ్జెట్ సమావేశాలపై కూడా పడింది. మిడిల్ ఈస్ట్ దేశాల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం, ఆ పరిస్థితులపై లోక్ సభలో తక్షణ చర్చ చేపట్టాలని కోరుతూ ప్రతిపక్షాలు పట్టుబట్టడంతో సోమవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సభ ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష సభ్యులు వాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించి, సరిహద్దుల్లో మారుతున్న పరిణామాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే, చైర్మన్ ఈ ప్రతిపాదనను తిరస్కరించడంతో సభలో ఒక్కసారిగా గందరగోళం మొదలైంది. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ప్రతిపక్ష నేతలు నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. వారితో చైర్మన్ వారించినప్పటికీ విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ప్లకార్డులతో నిరసన తెలిపారు. యుద్ధం వంటి సున్నితమైన అంశంపై చర్చకు వెనుకాడటం సరికాదని, దేశ భద్రత దృష్ట్యా దీనిపై సమగ్ర వివరణ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సభ్యుల నినాదాలు, తోపులాటల మధ్య సభలో తీవ్ర గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో సభను సజావుగా నడిపించడం సాధ్యం కాదని భావించిన చైర్మన్ లోక్‌సభను నేటికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

# గవర్నర్‌కు ఘన వీడ్కోలు

## బేగంపేట విమానాశ్రయంలో పుష్పగుచ్ఛాలు అందజేసిన ఉన్నతాధికారులు





**హైదరాబాద్, మార్చి 9:** తెలంగాణ గవర్నర్‌గా సేవలందించి, బదిలీపై మహారాష్ట్ర గవర్నర్‌గా వెళ్తున్న జిష్ణు దేవ్ వర్మకు సోమవారం బేగంపేట విమానాశ్రయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. మహారాష్ట్రలో నూతన బాధ్యతలు చేపట్టేందుకు ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడి నుంచి బయలుదేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, పంచాయతీ రాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ తదితరులు బేగంపేట ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ దంపతులకు పుష్పగుచ్ఛాలు అందజేసి, వారిని సాదరంగా కలిశారు. తెలంగాణలో వారి పదవీకాలం విజయవంతంగా సాగినందుకు అభినందనలు తెలుపుతూ వీడ్కోలు పలికారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తన పర్యటన ముగించుకుని ప్రత్యేక విమానంలో ముంబైకి బయలుదేరి వెళ్లారు. అక్కడ ఆయన మహారాష్ట్ర నూతన గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.




## వివేకా హత్య కేసులో విచారణ

### సీబీఐ ఫైల్స్ ఇండెక్స్ కోరిన నిందితులు

**కడప, మార్చి 9:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుపై సీబీఐ కోర్టులో సోమవారం విచారణ జరిగింది. నిందితులు సీబీఐకోసం కాకుండా, ముందుగా సిట్ దర్యాప్తు చేసిన వివరాలను అందజేయాలని న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. సీబీఐ ఇచ్చిన 13 లక్షల ఫైల్స్‌ను ఇండెక్స్ రూపంలో పొందుపరిచి ఇవ్వాలని నిందితులు కోర్టును కోరారు. సీబీఐ అందజేసిన 13 లక్షల డిజిటల్ ఫైల్స్‌లో కొన్ని ఓపెన్ అవ్వలేదని కోర్టుకు నిందితుల న్యాయవాదులు తెలిపారు. అందువల్ల సీబీఐ ఇచ్చిన ఫైల్స్‌ను ఇండెక్స్ రూపంలో పొందుపరిచి అందించాలని కోరారు. నిందితుల న్యాయవాదుల అభ్యర్థనలను న్యాయస్థానం పరిశీలించింది. ఓపెన్ కాని ఫైల్స్‌ను మంగళవారం కోర్టు సమక్షంలో ఓపెన్ చేయడానికి సీబీఐను ఆదేశించింది. ఈ కారణంగా, కేసులో తదుపరి విచారణను న్యాయస్థానం నేటికి వాయిదా వేసింది.

## పోలవరం జిల్లాలో పులిసంచారం

### 20 రోజులుగా స్థానికుల ఆందోళన



**పోలవరం, మార్చి 9:** పోలవరం జిల్లాలో గత 20 రోజులుగా పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. ఈ పులి మొదట్లో పోలవరం జిల్లాలోని అడవి ప్రాంతాల్లో, రంపచోడవరం, అడ్డతీగల మండలాల పరిసరాల్లో కనిపించింది. ఆ తర్వాత కొన్ని రోజుల పాటు తూర్పు గోదావరి జిల్లాలోకి వెళ్లి, ఏలేశ్వరం మండలం పరింతడక, మర్రివీడు ప్రాంతాల్లో పశువులపై దాడులు చేసింది. అక్కడ గేదెలు, దూడలను దాడి చేసి చంపేసింది. దీంతో అటవీ అధికారులు అప్రమత్తమై, పులిని బంధించేందుకు విస్తృతంగా చర్యలు చేపట్టారు. అయితే, పులి మళ్లీ తప్పించుకుని పోలవరం జిల్లాలోనికి తిరిగి ప్రవేశించింది. ప్రస్తుతం రాజవొమ్మంగి రేంజ్ పరిధిలోని సర్రంపేట అడవి ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు సమీప గ్రామాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అటవీ ప్రాంతాలకు వెళ్లవద్దని, ఒంటరిగా తిరగవద్దని సూచించారు. పశువులను అడవి ప్రదేశాలకు తీసుకెళ్లి మేపవద్దని, రాత్రి వేళల్లో బయటకు రావద్దని, పశువులను సురక్షితంగా ఉంచాలని కోరారు. పులిని సురక్షితంగా బంధించేందుకు పెద్ద ఎత్తున గాలింపు, ఆపరేషన్ చర్యలు కొనసాగుతున్నాయి. ఇటీవల వీరభద్రపురం, కొనలోవ, గొండోలు, గవరయ్యపేట, కొట్టంపాలెం వంటి గ్రామాల పరిసరాల్లో పులి జాడలు, పాదముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే. యేలేరు రిజర్వాయర్ పరివాహక ప్రాంతం నుంచి రాజవొమ్మంగి అటవీ ప్రాంతంలోకి పులి ప్రవేశించినట్లు ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు.

## శ్రీవారి లడ్డూ ప్రసాదాలకు నెయ్యి కొరత లేదు

### అసత్య ప్రచారాలను నమ్మవద్దు.. : టీటీడీ స్పష్టత




**తిరుమల, మార్చి 9:** శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి అవసరమైన ఆవు నెయ్యి నిల్వలు టీటీడీ వద్ద సమృద్ధిగా ఉన్నాయని, భక్తులు ఎటువంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దని తిరుమల తిరుపతి దేవస్థానం సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. సోషల్ మీడియాలో నెయ్యి నిల్వలు లేవని, ప్రసాదాల తయారీకి అంతరాయం ఏర్పడుతోందని జరుగుతున్న ప్రచారం కేవలం పుకార్లేనని టీటీడీ కొట్టిపారేసింది. లడ్డూ తయారీ కోసం టీటీడీ ఒకే సంస్థపై ఆధారపడకుండా, మూడు వేర్వేరు సంస్థల నుండి నెయ్యిని సేకరిస్తోంది. ఇటీవల ఇందాపూర్ డైరీకి చెందిన ఒక నెయ్యి ట్యాంకర్ కడప జిల్లా కొండాపూర్ వద్ద ప్రమాదానికి గురైన మాట వాస్తవమేనని, అయితే మిగిలిన రెండు సంస్థల నుండి సరఫరా యథావిధిగా కొనసాగుతోందని టీటీడీ వివరించింది. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఎలాంటి పరిస్థితుల్లోనూ సరఫరాకు ఆటంకం కలగదని స్పష్టం చేసింది. భక్తుల కోసం ప్రస్తుతం సుమారు 7 లక్షల లడ్డూ ప్రసాదాలు సిద్ధంగా ఉన్నాయని టీటీడీ తెలిపింది. రాబోయే వేసవి కాలంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొంది. లడ్డూ తయారీ కేంద్రం (పోటు) లోని యంత్రాల నిర్వహణ, కన్వేయర్ బెల్ట్‌ల మరమ్మతులు క్రమం తప్పకుండా జరుగుతున్నాయని వెల్లడించింది. వాస్తవాలు తెలుసుకోకుండా భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా అబద్ధపు ప్రచారాలు చేయడం సరికాదని టీటీడీ అసహనం వ్యక్తం చేసింది. శ్రీవారి కైంకర్యాలు మరియు లడ్డూ పంపిణీ పూర్తిస్థాయిలో కొనసాగుతోందని, భక్తులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్య ప్రజా సంబంధాల విభాగం మరోసారి స్పష్టం చేసింది.

# భూములకు భరోసా.. రైతులకు భద్రత

మొదటి పేజీ తరువాయి





సీమ ప్రాంత అభివృద్ధిపై తనకున్న సంకల్పాన్ని వివరిస్తూ, రాయలసీమను దేశానికే ఉద్యానవన కేంద్రంగా మారుస్తామని సీఎం ప్రకటించారు. హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగుగంగ వంటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతీ ఎకరాకు నీరందిస్తామన్నారు. డోన్ నియోజకవర్గంలో ఇప్పటికే 30 చెరువులకు హంద్రీనీవా ద్వారా నీరు ఇచ్చామని తెలిపారు.

**రైతులకు రాయితీలు:**

మామిడి రైతులకు కేజీకి రూ. 4 సబ్సిడీతో పాటు, కవర్ల వినియోగంపై 50% రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో టన్నుకు రూ. 1.70 లక్షల వరకు ధర లభిస్తోందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రజాహితం కోసమే పనిచేస్తోందని గత ప్రభుత్వం 8 సార్లు ఛార్జీలు పెంచి భారం వేసిందని, కూటమి ప్రభుత్వంలో కరెంట్ ఛార్జీలు పెంచే ప్రసక్తే లేదని ఆయన హామీ ఇచ్చారు. 'తల్లికి వందనం' ద్వారా ప్రతీ బిడ్డకు రూ. 15 వేలు, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తున్నామన్నారు. లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నామని, భవిష్యత్తులో ఈ సంఖ్యను 5 లక్షలకు చేరుస్తామని వెల్లడించారు. కర్నూలులో డ్రోన్ సిటీ, అనంతపురంలో ఎయిరో స్పేస్ సిటీ ఏర్పాటు ద్వారా ఈ ప్రాంత ముఖచిత్రాన్ని మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. తిరుమల లడ్డూ కల్తీ, మద్యం కుంభకోణాలపై గత ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి తీవ్రంగా ఎండగట్టారు. భక్తిని, ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి అవినీతికి పాల్పడ్డారని మండిపడ్డారు. సీమలో ముఠా తగాదాలను అంతం చేసి, ప్రశాంతమైన వాతావరణంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు.

## మద్యం కేసులో ఈడీ దూకుడు

### నిందితులకు నోటీసులు జారీ

**అమరావతి, మార్చి 9:** ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీ దూకుడు పెంచింది. మద్యం కుంభకోణంలో నిందితులుగా ఉన్న ధనుంజయరెడ్డి, వెంకటేష్ నాయుడు, చాణక్యలకు ఈడీ నోటీసులు జారీ చేసింది. బ్యాంక్ స్టేట్‌మెంట్లు, పాన్ కార్డులు, కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలతో పాటు సంబంధిత డాక్యుమెంట్లను తీసుకురావాలని నోటీసుల్లో స్పష్టంగా పేర్కొంది. విచారణకు హాజరుకావాలని ఈడీ ఆదేశించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ మద్యం స్కామ్‌లో వేల కోట్ల రూపాయల కమీషన్లు, మనీలాండరింగ్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవలే రూ.441 కోట్లకు పైగా ఆస్తులను ఈడీ అటాచ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో సీఐడీ సిట్ ఇచ్చిన రిపోర్టుల ఆధారంగా కీలక నిందితులకు సంబంధించిన ఆస్తులను భారీ ఎత్తున జప్తు చేసింది. ప్రధాన నిందితులుగా ఉన్న రాజ్ కసిరెడ్డి, చాణక్య, వాసుదేవరెడ్డికి చెందిన రూ.441 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది.

## దస్త్రాల దోషులకు బెయిల్ నిరాకరణ



**న్యూఢిల్లీ, మార్చి 9:** అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రెవెన్యూ దస్త్రాల దహనం కేసులో ఇద్దరు నిందితులకు సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో ఏ3గా ఉన్న మాధవరెడ్డి, ఏ4గా ఉన్న మునిరత్నానికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. దర్యాప్తు పురోగతికి తాము అడ్డురాలేమని జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. నిందితుల్లో ఒకరు మాజీ మంత్రి పెద్దిరెడ్డి మాజీ పీఏ కాగా, మరొకరు ప్రధాన అనుచరుడిగా ఉన్నారు.



## ఐపీఎస్ సునీల్ నాయక్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

### 12 వరకు విచారణకు హాజరుకావాలని హైకోర్టు ఆదేశం

**అమరావతి, మార్చి 9:** ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా దర్యాప్తు అధికారి చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. సునీల్ నాయక్ ఈ నెల 12వ తేదీ వరకు దర్యాప్తు అధికారుల ముందు విచారణకు హాజరుకావాలని హైకోర్టు స్పష్టం చేసింది. దర్యాప్తుకు సహకరించాలని సూచిస్తూనే, తదుపరి విచారణను మార్చి 12కు వాయిదా వేసింది. ఈ కేసులో దర్యాప్తు పురోగతిని బట్టి ఆ రోజున ముందస్తు బెయిల్‌పై న్యాయస్థానం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## అంతుచిక్కని వైరస్

### తెలంగాణలో వేల సంఖ్యలో కోళ్ల మృతి
### కోళ్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి
### పశుసంవర్ధక శాఖ సంచాలకులు
### తెలంగాణ సరిహద్దు జిల్లాల్లో హై అలర్ట్

**విజయవాడ, మార్చి 9:** తెలంగాణ రాష్ట్రంలోని నాగర్ కర్నూల్ జిల్లాలో పెద్ద సంఖ్యలో కోళ్లు మరణించినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ రాష్ట్రంలోని కోళ్ల రైతులను అప్రమత్తం చేసింది. ముఖ్యంగా తెలంగాణ సరిహద్దు జిల్లాల్లోని రైతులు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, జీవభద్రతా (బయోసెక్యూరిటీ) ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ టి. దామోదర్ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. తెలంగాణ సరిహద్దు జిల్లాల్లోని పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది తమ పరిధిలోని కోళ్ల ఫామ్‌లపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆయన ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుంచి కోళ్లు, గుడ్లు లేదా వాటి ఉత్పత్తుల రవాణాను కట్టుదిట్టం చేయాలని సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న కోళ్ల పెంపకదారులు అనుమతి లేకుండా ఇతర రాష్ట్రాల నుండి కోళ్లు, గుడ్లు తీసుకురాకూడదని స్పష్టం చేశారు. ఫామ్‌లలోకి బయటి వ్యక్తుల ప్రవేశాన్ని నిరోధించాలని, పరిశుభ్రత మరియు క్రిమిసంహారక చర్యలను క్రమం తప్పకుండా నిర్వహించాలని తెలిపారు. కోళ్లలో అకస్మాత్తుగా మరణాలు సంభవించినా లేదా ఏదైనా అనారోగ్య లక్షణాలు కనిపించినా వెంటనే సమీపంలోని పశువైద్యాధికారికి సమాచారం అందించాలని డా. దామోదర్ నాయుడు కోరారు. చనిపోయిన కోళ్లను నిర్లక్ష్యంగా పారేయకుండా, పశుసంవర్ధక శాఖ సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతిలో పూడ్చివేయాలని సూచించారు. రాష్ట్రంలోని కోళ్ల పెంపకదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే వ్యాధి వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. పరిస్థితిని శాఖా పరంగా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ఆయన పునరుద్ఘాటించారు.



## గర్భాశయ క్యాన్సర్ నివారణకు అడుగు

**అమరావతి, మార్చి 9:** మహిళల్లో ప్రాణాంతక గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) ముప్పును తప్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన హెచ్‌పీవీ (హ్రూఎ) టీకా పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించింది. 14 ఏళ్ల వయస్సు గల బాలికలకు ఉచితంగా ఈ టీకాను అందజేసే ఈ ప్రక్రియ తొలి దశలో కోనసీమ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, ప్రకాశం, పల్నాడు, శ్రీ సత్యసాయి, విజయనగరం, విశాఖపట్నం మరియు పశ్చిమ గోదావరి జిల్లాల్లో మొదలైంది. మిగిలిన జిల్లాల్లో మంగళవారం నుంచి ఈ టీకా అందుబాటులోకి రానుంది. తొలిరోజు సుమారు 1500 మంది బాలికలకు వ్యాక్సినేషన్ విజయవంతంగా పూర్తి చేసినట్లు వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ భారీ కార్యక్రమం కోసం రాష్ట్రవ్యాప్తంగా కోల్డ్ చైన్ సౌకర్యం ఉన్న 1,647 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. గ్రామ మరియు వార్డు సచివాలయాల రికార్డుల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా 3.45 లక్షల మంది బాలికలను లబ్ధిదారులుగా గుర్తించారు. టీకా వేయడానికి ముందు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు బాలికల తల్లిదండ్రులను కలిసి టీకా ప్రాధాన్యతను వివరిస్తున్నారు. తల్లిదండ్రుల సమ్మతి తీసుకున్న తర్వాతే ఆధార్ కార్డు నంబర్ ఆధారంగా 'యువిన్' (ఖ-ఔఱఅ) యాప్‌లో వివరాలను నమోదు చేసి టీకా వేస్తున్నారు. వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత బాలికలను సుమారు 30 నిమిషాల పాటు ఆరోగ్య కేంద్రాల్లోనే పర్యవేక్షణలో ఉంచుతున్నారు. టీకా వేసిన చోట స్వల్పంగా నొప్పి, ఎర్రబడటం, వాపు లేదా తేలికపాటి జ్వరం వంటి సాధారణ లక్షణాలు కనిపించే అవకాశం ఉందని, ఇవి రెండు మూడు రోజుల్లో తగ్గిపోతాయని అధికారులు స్పష్టం చేశారు. హెచ్‌పీవీ టీకా అత్యంత సురక్షితమైనదని, భవిష్యత్తులో గర్భాశయ ముఖ క్యాన్సర్ నివారణలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఈ టీకా పంపిణీ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా రాబోయే మూడు నెలల పాటు నిరంతరాయంగా కొనసాగనుంది.

- ఏపీలో హెచ్‌పీవీ టీకా పంపిణీ ప్రారంభం
- 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా వ్యాక్సిన్.. తొలిరోజు 10 జిల్లాల్లో శ్రీకారం
- రాష్ట్రవ్యాప్తంగా 3.45 లక్షల మంది బాలికల గుర్తింపు
- కమిషనర్ వీరపాండియన్

## ఉపాధి హామీ 16వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా.

● యాలాల మండల కేంద్రంలో సర్పంచ్ సి హెచ్ శివయ్య అధ్యక్షతన గ్రామసభ



**యాలాల మండలం, మార్చి,09(సమయం న్యూస్) :** యాలాల మండల కేద్రంలో ఉపాధి హామీ 16వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా గ్రామ చావిడి దగ్గర గ్రామ సర్పంచ్ సి హెచ్ శివయ్య అధ్యక్షతన గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్ గోనేగారి శ్రీనివాస్,గ్రామ ఉపసర్పంచ్ శోభా రెడ్డి,ఫీల్డ్ అసిస్టెంట్ సంకరాం లాలు,గ్రామ వార్డు మెంబర్లు,గ్రామపంచాయతీ సెక్రటరీ ఆనంద్,గ్రామ కమిటీ అధ్యక్షులు రాపోల్ నాగయ్య, కార్యదర్శి హైమద్, సహాయ కార్యదర్శి గొల్ల చందు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుమారుతీ, అధ్యక్షులు అశోక్ నాయి,బుర్ధ పూరి నర్సింలు,దూస వెంకటేష్, గడ్డం నర్సిములు,ఉపాధి హామీ కూలీలు మరియు తనిఖీ అధికారులు పాల్గొనడం జరిగింది

## భారత క్రికెట్ జట్టుకు నరేష్ క్రికెట్ అకాడమీ అభినందనలు



**బాన్సువాడ మార్చి9 (సమయం న్యూస్) :** టీ20 ప్రపంచ విజేతగా నిలిచిన భారత క్రికెట్ జట్టుకు నరేష్ క్రికెట్ అకాడమీ -- బాన్సువాడ తరపున అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ క్రీడాకారుడు, క్రికెట్ కోచ్ నరేష్ మాట్లాడుతూ భారత జట్టు ప్రపంచ క్రికెట్‌లో మరోసారి తమ సత్తా చాటిందన్నారు. టీ20 ప్రపంచకప్‌ను మూడుసార్లు గెలిచిన తొలి జట్టుగా నిలవడం, వరుసగా రెండు సార్లు టైటిల్ సాధించడం భారత క్రికెట్‌కు గర్వకారణమని పేర్కొన్నారు. అలాగే ఆతిథ్య దేశంగా కూడా టీ20 ప్రపంచకప్‌ను గెలిచిన తొలి జట్టుగా భారత జట్టు చరిత్ర సృష్టించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన భారత జట్టు ఆటగాళ్ల ప్రతిభను కొనియాడారు. సంజు శాంసన్ నిలకడగా ఆడుతూ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జట్టుకు గొప్ప విజయాన్ని అందించాడన్నారు. అభిషేక్ శర్మ సరైన సమయంలో అద్భుతంగా రాణించి తన ప్రతిభను నిరూపించుకున్నాడని తెలిపారు. అలాగే అక్షర్ పటేల్, జస్ప్రీత్ బుమ్రా, ఇషాన్ కిషన్ ల ప్రదర్శన యువ క్రికెటర్లకు ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. భారత ఆటగాళ్ల కృషి, పట్టుదల మరియు జట్టు భావన దేశ యువతకు గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా 5కె రన్ నిర్వహణ



**బాన్సువాడ మార్చి9(సమయం న్యూస్) :** కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణం లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం బాన్సువాడ పురపాలక సంఘం ఆధ్వర్యంలో 5కె రన్ కార్యక్రమం నిర్వహించారు.

పురపాలక సంఘం కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ రన్ కార్యక్రమంలో ప్రజలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నగరంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగిన ఈ రన్ కార్యక్రమం ప్రజల్లో అవగాహన కల్పించేలా సాగింది. ప్రజాపాలన కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ప్రజలు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి , ఖాలేక్ ఎజాజ్.. మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు. ప్రజలు భాగస్వామ్యం కావడం ద్వారా వార్డులు మరియు మున్సిపాలిటీలు మరింత అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ప్రజల సహకారంతోనే స్వచ్ఛమైన, అభివృద్ధి చెందిన పట్టణాలను నిర్మించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు ఆధ్వర్యంలో నిర్వహించబడింది. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఏర్వాల కృష్ణరెడ్డి, ఎజాజ్, రోహిత్, కౌన్సిలర్లు నందకిశోర్, లింగమేశ్వర్, జంగం రాజశేఖర్, కటిక రమేష్, నగేష్ మరియు నాయకులు పంతులు రాము, దాసరి శ్రీనివాస్, భీమ్ రాజ్ పాల్గొన్నారు.

## కొడంగల్ మెతడిస్ట్ చర్చ్ లో మహిళా దినోత్సవం వేడుకలు

● రెవరెండ్ పాస్టర్ వంశిధర్ నేతృత్వంలో మహిళా దినోత్సవం



**కొడంగల్ మున్సిపల్,మార్చి,09 (సమయం న్యూస్) :** కొడంగల్ పట్టణ కేంద్రంలోని శాంతినగర్ కాలోనిలోని మెతడిస్ట్ చర్చిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. చర్చ్ ఆవరణలో రెవరెండ్ పాస్టర్ వంశిధర్ నేతృత్వంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మెతడిస్ట్ చర్చ్ లోమహిళలకు బొకేల తోఘనంగా సన్మానించారు. అనంతరం ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మెతడిస్ట్ చర్చ్ కొడంగల్ సంగం,సంగపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కోస్గి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా సుధాకర్ గౌడ్.

● నూతన కార్యవర్గానికి సన్మానించిన మున్సిపల్ చెర్మెన్ నాగులపల్లి నరేందర్...

● గ్రంథాలయ చెర్మెన్ వార్ల విజయకుమార్,

● మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి



**కోస్గి మండలం,మార్చి,09(సమయం న్యూస్ :** కోస్గి మండల సర్పంచుల సంఘం నూతన కార్యవర్గం కొలువుదిరింది. మండలంలోని సర్పంచులు కోస్గి మండల కేంద్రంలో సమావేశమై సర్పంచుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ముంగిమల్ల గ్రామ సర్పంచ్ సుధాకర్ గౌడ్ , ఉపాధ్యక్షురాలుగా మీర్జాపూర్ గ్రామ సర్పంచ్ అర్చన లను ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా బోల్వాన్పల్లి గ్రామ సర్పంచ్ ఎల్పటి వెంకటయ్య , కార్యదర్శిగా పీ సి తాండ గ్రామ సర్పంచ్ గోపాల్ నాయక్ , సహాయ కార్యవర్గ సభ్యులుగా తోగాపూర్ గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, నాచారం గ్రామ సర్పంచ్ రేణుక లుగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని కోస్గి మున్సిపాలిటీ చైర్మన్ నాగులపల్లి నరేందర్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయకుమార్ ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రఘు వర్ధన్ రెడ్డి లు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు బిజ్జారం సర్పంచ్ విద్యాసాగర్ ,సర్జ ఖాన్ పేట్ సర్పంచ్ మౌనిక, చంద్రవంచ సర్పంచ్ విద్యావతి , ముక్తిపాడు సర్పంచ్ విద్యవతమ్మ ,చెన్నారం సర్పంచ్ కృష్ణయ్య , కొత్తపల్లి సర్పంచ్ హనుమయ్య, ముశ్రీఫా సర్పంచ్ వెంకటమ్మ లు పాల్గొన్నారు.

## ZPHS గర్ల్స్ స్కూల్ లో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

● బాలికల భద్రతే షీ టీమ్స్ లక్ష్యం

● పరిగి సబ్ డివిజన్

● "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సింహులు




**కొడంగల్ మున్సిపాలిటీ మార్చి 09(సమయం న్యూస్) :** ఆన్ లైన్ మోసాలు, సైబర్ నేరాల పై అప్రమత్తంగా వుండాలని పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సింహులు అన్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణము లోని జడ్పిహెచ్ఎస్ గర్ల్స్ స్కూల్ లో సోమవారం జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా మరియు పరిగి డిఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సింహులు ఆద్వర్యంలో విద్యార్థులకు "షీ" టీమ్ పనితీరు, ఆన్ లైన్ మోసాలు, 1930, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సింహులు మాట్లాడుతూ బాలికల భద్రతే "షీ" టీమ్స్ లక్ష్యమని పాఠశాలలో కాని బయట ఎక్కడైన ఆకతాయిలు బాలికలను భయాందోళనలకు గురిచేసినా, వేధించినా ఇబ్బందికరంగా మాట్లాడిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 100, 181 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా మహిళ పై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం, 100డైయల్ "షీ" టీమ్ నం-181, సీసీ కెమెరాలు, బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలిసింగ్, మానవ అక్రమ రవాణ, మద్యపాన నిషేధం, బ్యాంకింగ్ ఆన్లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం అదేవిధంగా సైబర్ క్రైం నం.1930 పై అవగాహన తోపాటు వివిధ అంశాలపై విద్యార్థిని విద్యార్థులకు లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిహెచ్ఎస్ గర్ల్స్ స్కూల్ ఇంచార్జి హెడ్ మాస్టర్ శమాల, ఉపాధ్యాయులు,విద్యార్థినిలు తోపాటు "షీ" టీమ్ సభ్యులు శోభ,బి.సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

● అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి



**ఖమ్మం, మార్చి 9:( సమయం న్యూస్ ) :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి ప్రజల అర్జీలను స్వీకరించారు. వెలుగుమట్ల భూదాన్ భూములకు చెందిన సిరికొండ కళ్యాణి తన ఇల్లు కూల్చేశారని, తనకు ప్రభుత్వం తరపున అందించే సహాయం అందించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ ఈ విభాగం అధికారికి రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం అర్బన్ మండలంలో సారధి నగర్ కు చెందిన గాలి నాగేశ్వరమ్మ తాము గత 40 సంవత్సరాలుగా నివసిస్తున్న ఇంటిని రోడ్డు విస్తరణలో తొలగించాలని చూస్తున్నారని, తమకు ఆర్థిక సహాయం చేసి, మరోచోట ఇంటిని మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ ఈ విభాగం అధికారికి రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. చింతకాని మండలం కోమట్లగూడెం గ్రామ సర్పంచ్ కొందూరి పరిశుద్ధ రావు గ్రామంలో రైతులు పండించిన మొక్కజొన్న మార్క్ ఫెడ్ ద్వారా మద్దతు ధరపై కొనుగోలు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా మార్క్ ఫెడ్ అధికారికి రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం పట్టణానికి చెందిన దళిత వర్గీయులు గత ప్రభుత్వంలో 320 మంది లబ్ధిదారులకు దళిత బంధు నిధులు మంజూరి అయి ఉన్నాయని, వాటిని తమకు మంజూరు చేసి యూనిట్లు ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈడి ఎస్సీ కార్పొరేషన్ కు రాస్తు పరిశీలించి తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన మంత్రి - సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఐ.ఏ.ఎస్




**కామారెడ్డి మార్చి09( సమయం న్యూస్). :** సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రధాన మంత్రి - సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ+=జుణజూ ఆధ్వర్యంలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమ లో భాగంగా పీఎం - సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా ప్రతీ విద్యుత్ వినియోగదారుడు తమ ఇళ్ల రూఫ్ టాప్ పై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని, కర్బన ఉద్గారాలు జీరో స్థాయికి తేవాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపల్ పరిధిలో అవగాహన కల్పించాలని సూచించారు. మూడు కిలోవాట్ల సోలార్ పలకలు ఏర్పాటు చేసుకొంటే కేంద్ర ప్రభుత్వం రూ.78 వేలు సబ్సిడీ అందిస్తుందని, దాంతో పాటు ప్రతీ నెలా రూ.2 వేల విద్యుత్ బిల్లు అదా చేయవచ్చని తెలిపారు. పెట్టుబడి 5 సంవత్సరాల్లో తిరిగి వస్తుందని అన్నారు. సోలార్ విద్యుత్ పర్యావరణ హితమని తెలిపారు. మిగులు విద్యుత్ ను గ్రిడ్ కు ఇస్తూ అదనపు ఆదాయాన్ని కూడా పొందవచ్చని , ఈ పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అదనపు కలెక్టర్-రెవెన్యూ .వి. విక్టర్, ACLB మధుమోహన్ , జిల్లా ప్రజా సంబంధాల అధికారి Smt. తిరుమల, TGREDCO జిల్లా మేనేజర్ జు. రమణ, AFO జగదీప్ రామ్ పాల్గొన్నారు.

# నీతి అయోగ్ బెస్ట్ ప్రాక్టీసెస్ సెమినార్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

- పెంబి బ్లాకు ప్రగతిపై సెమినార్ వేదికగా ప్రసంగం.
- ప్రజల భాగస్వామ్యం, అధికారుల సమష్టి కృషితో పెంబి ప్రగతి సాధ్యమైందని వెల్లడించిన
- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.




**నిర్మల్/ విశాఖ పట్నం మార్చి09( సమయం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం వేదికగా, సోమవారం జరిగిన నీతి అయోగ్ బెస్ట్ ప్రాక్టీసెస్ సెమినార్ లో జిల్లా కలెక్టర్ అభిలాష పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నీతి అయోగ్ ఆస్పిరేషన్ బ్లాకు కార్యక్రమం కింద పెంబి మండలంలో చేపట్టిన ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, తదితర మౌళిక సదు-పాయాల కల్పనలో చేసిన కృషి, తద్వారా సాధించిన ప్రగతి వివరాలు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పెంబి అభివృద్ధిలో ఎదురైన సవాళ్లు, చేపట్టి చర్యలు సెమినార్ లో వెల్లడించారు. ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి, మహిళలు, గర్భిణుల్లో రక్తహీనత, పోషకాహార లోపాల నివారణ, రోగాల నిర్ధారణ, నివారణ, భూసార పరీక్షల నిర్వహణ, అక్షరాస్యత, విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపు, మౌళిక సదుపాయాల మెరుగు, తదితర అంశాల్లో అద్భుత ప్రగతి సాధించినట్లు కలెక్టర్ వివరించారు. స్థానిక ప్రజల భాగస్వామ్యం, అధికారుల సమష్టి కృషివల్ల పెంబి బ్లాకు ఆస్పిరేషన్ నుంచి ఇన్స్పిరేషన్ గా పయనించిందని సంతోషం వ్యక్తం చేశారు. కాగా పెంబి బ్లాకులో చేపట్టిన కార్యక్రమాలకు గాను, నీతి అయోగ్ బెస్ట్ ప్రాక్టీసెస్ సెమినార్ కు నిర్మల్ జిల్లా ఎంపికయ్యింది. తెలంగాణ నుంచి కేవలం రెండు జిల్లాలు మాత్రమే ఎంపికవ్వడం మన జిల్లాకు గర్వకారణం. పెంబి బ్లాకు విజయ ఖ్యాతి మరోసారి చాటిచెప్పేందుకు ఈ నీతి అయోగ్ బెస్ట్ ప్రాక్టీసెస్ సెమినార్ వేదికయ్యింది. పెంబి బ్లాక్ అభివృద్ధిలో పాలుపంచుకున్న అధికారులకు, ప్రజలకు మరొకసారి కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# గిరిజన సంక్షేమశాఖ నూతన సంచాలకులుగా బాధ్యతలు స్వీకరించిన సంతోష్ బి.ఎం., ఐఏఎస్



**హైదరాబాద్ మార్చి09(సమయం న్యూస్) :** హైదరాబాద్ లోని మాసబ్ ట్యాంక్ లో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈ రోజు శ్రీ సంతోష్బి.ఎం., ఐఏఎస్, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీ సంతోష్ బి.ఎం. మాట్లాడుతూ ఆయా విభాగాల అధికారులు, సిబ్బందితో వారి వారి విధులు, పనులను గూర్చి సమీక్ష చేశారు. చేయవలసిన పనులను గూర్చి తనకు విభాగాల వారీగా తెలియజేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ-ఫైల్స్ పెట్టడం కూడా ప్రారంభించాలన్నారు. విభాగాలవారీగా అధికారులు తమ విధులు, బాధ్యతల గురించి తనకు వివరాలు ఇవ్వాలని, ఆ మేరకు పనులు చేసుకుంటూ వెళ్తామని అన్నారు. గిరిజన సంక్షేమ పథకాలు అన్ని కూడా అడవులలో చివరి మజిలీలో ఉన్న చివరి గిరిజనులకు కూడా చేరేటట్లు ప్రణాళికలు రచించాలని, ప్రత్యేకించి గిరిజనుల ఆరోగ్యం, విద్యావకాశాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,గిరిజన సంక్షేమం మీద పూర్తి అవగాహన ఏర్పరచుకుని వారం రోజులలో గిరిజన ప్రాంతాలలో పర్యటించి గిరిజన సమస్యలను, సంక్షేమ అవసరాలను తెలుసుకుని తదనుగుణంగా చర్యలుతీసుకుంటానని అన్నారు.ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు శ్రీ సంతోష్ బి.ఎం. గారికి గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు శ్రీ విట్టా సర్వేశ్వర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ బాలు, గిరిజన పరిశోధన సంస్థ సంచాలకులు డా. వి. సముజ్వల, జీసీసీ జీఎం శ్రీ ప్రతాప్ రెడ్డి, జాయింట్ డైరెక్టర్లు శ్రీ పోచం, శ్రీమతి సంధ్యారాణి తదితర అధికారులు పూల మొక్కలు ఇచ్చి ఆహ్వానించారు.గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీ సంతోష్ బి.ఎం. సచివాలయానికి వెళ్ళి సంక్షేమ శాఖలస్పెషల్ చీఫ్ సెక్రెటరీ శ్రీ సబ్యసాచి ఘోష్ గారికి పూల మొక్క ఇచ్చి మర్యాద పూర్వకంగా కలిశారు.

# ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- సీఐ శివశంకర్
- అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్,
- ఓటీపీలు,బ్యాంకు వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దు...
- సైబర్ నేరానికి గురైతే గోల్డెన్ అవర్ లో
- 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలి-సీఐ



**నారాయణపేట, మార్చి,09(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా... సైబర్ నేరానికి గురైతే గోల్డెన్ అవర్ లో 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలి.నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అప్పక్పల్లి గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాల నివారణ, దొంగతనాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ శివశంకర్ మాట్లాడుతూ... ప్రస్తుతం రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. బ్యాంకు అధికారులు లేదా ఇతర సంస్థల పేరుతో కాల్ చేసి డబ్బులు మోసం చేసే ఘటనలు ఎక్కువగా జరుగుతున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఏవైనా సైబర్ మోసాలు జరిగితే నేరం జరిగిందని తెలిసిన మొదటి గంట లోపల (గోల్డెన్ అవర్) లో వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా డయల్ 100 లేదా లోకల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.అలాగే యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి వంటి నిషేధిత పదార్థాల వినియోగం మరియు రవాణాపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, దొంగతనాలకు అవకాశం ఉన్న పరిస్థితులు ఉన్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.గ్రామాల్లో శాంతి భద్రతలు కాపాడటంలో ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని, పోలీసులతో కలిసి పనిచేస్తే నేరాలను తగ్గించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై రాముడు, పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మెగా మహిళ రైతు మేళా సందర్భంగా క్షేత్ర స్తాయిలో సందర్శించిన మహిళా రైతులు.



**మహబూబ్ నగర్ మార్చి09( సమయం న్యూస్).** :ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (ఞజీూౄఖ), రాజేంద్రనగర్‌లో మార్చి 8,9 తేదీల్లో నిర్వహించిన మెగా రైతు మేళా కు క్షేత్ర స్థాయి సందర్శనలో భాగంగా మహబూబ్ నగర్ జిల్లా మహిళ రైతులు సోమవారం పాల్గొన్నా రు.

**రాష్ట్ర ప్రభుత్వ "ప్రజా పాలన --** ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈ మేళాను విశ్వవిద్యాలయం మొదటి ప్రధాన కార్యక్రమంగా చేపట్టింది. ఈ ప్రద ర్శన ముఖ్యంగా 'రైతు సంక్షేమం' మరియు 'మహిళా సాధికారత' అనే ఇతివృత్తాలతో సాగింది.

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,రాష్ట్ర పరిశ్రమలు,ఐ.టి శాఖ మంత్రి శ్రీధర్ బాబు లు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**మహిళా సాధికారత:** రాష్ట్ర వ్యవసాయ రంగంలో 55% కంటే ఎక్కువగా ఉన్న మహిళా రైతులను బలోపేతం చేయడంపై ఈ మేళా ప్రత్యేక దృష్టి సారించింది.

**మహబూబ్ నగర్ మహిళా రైతుల సందర్శన:** మార్చి 9వ తేదీ సోమవారం మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మహిళా రైతులు క్షేత్రస్థాయి పరిశీలన (జుఞజూశీంబతీవ ఎఱంఱ్) కోసం ఈ మేళాకు హాజరయ్యారు.

**ప్రదర్శనలో ప్రధాన ఆకర్షణలు:సాంకేతికత మరియు ఆవిష్కరణలు:**

వ్యవసాయంలో డ్రోన్ల ద్వారా మందుల పిచికారీ, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), మరియు ఐఓటీ (×శీ) పరికరాల పనితీరుపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు.

**సుస్థిర వ్యవసాయం:** రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించేలా లి"ప్రకృతి వ్యవసాయం"లిపై రైతులకు అవగాహన కల్పించారు.

**ప్రదర్శన స్టాళ్లు:** దాదాపు 70-80 స్టాళ్ల ద్వారా ఆధునిక యంత్రాలు, అధిక దిగుబడినిచ్చే విత్తనాలు (+తీశీఎశీతీ ంశీశ్రీఙఱశీఅం) మరియు విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రదర్శించారు.

**ముఖాముఖి చర్చలు:** సాగులో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించుకోవడానికి శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతులతో నేరుగా చర్చించే అవకాశం కల్పించారు.

**పంటల వైవిధ్యం:** కేవలం వరి, పత్తి వంటి సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, ప్రత్యామ్నాయ లాభదాయక పంటల సాగుపై మార్గదర్శకత్వం చేశారు.

# బిజెపి 1టౌ న్ కార్యాలయంలో మహిళా దినోత్సవ సంబరాలు



**ఖమ్మం, మార్చి 8 : ( సమయం న్యూస్ )** భారతీయ జనతా పార్టీ 1టౌన అధ్యక్షులు గడిల నరేష్ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలను పార్టీ వన్ టౌన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో ఉన్న మహిళలను ఘనంగా సత్కరించారు. బిజెపి వన్ టౌన్ అధ్యక్షుడు గడిల నరేష్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ నేత్రుత్వంలో నారీశక్తి నినాదంతో మహిళలను భారత దేశ అత్యున్నత స్థానమైన రాష్టపతి , దేశ ఆర్థిక వ్యవస్థను నడిపించేది మహిళలే అని ఆర్థికశాఖ ను , దేశ భద్రత కు సంబంధించి రక్షణ శాఖ సైతం పురుషులతొ సమానంగా ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమం లో జిల్లా నాయకులు బండ్ల రిగాన్ ప్రతాప్, పొట్టిమూతి జనార్దన్, తుమ్మ శివ, మండల నాయకులు పాలేపు రాము, పొట్టిమూతి వాణి, కడుదుల ప్రభాకర్,తుమ్మ ఇందు, బాలి బిందు,మరిమెల్లా రామకృష్ణ,గాజరు పద్మ, నాగవెల్లి ఉదయలక్ష్మి పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం..



**కోస్గి మున్సిపల్,(మం)మార్చి,09(సమయం న్యూస్) :** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా నూతన ఇళ్లు ప్రారంభం కోస్గి మున్సిపల్ పరిధిలోని బహర్ పేట్ 11వ వార్డులో నిర్వహించారు. కోస్గి మున్సిపల్ చైర్మన్ నాగులపల్లి నరేందర్, నారాయణపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయకుమార్, కోస్గి మండలాధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి లు ఇందిరమ్మ లబ్ధిదారుడు ఈశ్వరమ్మ కు ఇల్లు మంజూరు కాగా ఇంటి నిర్మాణం పూర్తి కావడంతో నూతన గృహప్రవేశం చేశారు.ఈసందర్బంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇళ్లు లేని నిరుపేదలకు కొత్త ఇళ్లు మంజూరు చేయడంతో పట్టణంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేస్తున్నట్లు వారు తెలిపారు.ఈసందర్భంగా వార్డు కౌన్సిలర్ గాయత్రి బాలేష్,కోస్గి టౌన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ఫిరోజ్, దేవాదాయ కమిటీ సభ్యులు వేపూరు వెంకట్ రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 14 ఫిర్యాదులు ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ

- ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి
- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్- ఫణీందర్ రెడ్డి



**నారాయణపేట, మార్చి,09(సమయం న్యూస్) :** నారాయణపేట: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనీ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణింధర్ రెడ్డి,అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 14 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను వివిధ శాఖల అధికారులు ఆర్ . డి.ఓ.రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చోడలో స్పెషలిస్ట్ మెడికల్ క్యాంపును సందర్శించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఇచ్చోడ మార్చి09( సమయం న్యూస్) :** స్పెషలిస్ట్ మెగా ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్పెషలిస్ట్ మెడికల్ క్యాంపును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను, చికిత్సలను ఆయన స్వయంగా పరిశీలించి సమీక్షించారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సహాయంపై కలెక్టర్ ఆరా తీశారు. స్పెషలిస్ట్ డాక్టర్లను అందుబాటులో ఉంచి మెరుగైన చికిత్స అందిస్తున్నామని, మందుల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, స్పెషలిస్ట్ వైద్యులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఏంలు, గ్రామస్తులుజల, తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చోడ మండల ప్రజావాణిలో అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఇచ్చోడ మార్చి09( సమయం న్యూస్).** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజావాణి' పాల్గొని దరఖాస్తుదారుల నుండి నేరుగా అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను సవివరంగా విన్న కలెక్టర్, వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలోని రికార్డు గదిని క్షుణ్ణంగా పరిశీలించి, భూ రికార్డుల నిర్వహణ, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పక్కాగా భద్రపరచాలని, ప్రజలకు రెవెన్యూ సేవలు అందించడంలో జాప్యం చేయరాదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రామారావు, ఇచ్చోడ తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపిడిఓ ఎం. రవీందర్, వివిధ శాఖల మండల అధికారులు, సిబ్బంది, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

## గవర్నర్ కు ఘనంగా వీడ్కోలు



**హైదరాబాద్ మార్చి09( సమయం న్యూస్). :** మహారాష్ట్ర గవర్నర్ గా బదిలీపై వెళ్తున్న సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ , కుటుంబ సభ్యులకు బేగంపేట ఎయిర్ పోర్ట్ లోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చాను అందజేసి వీడ్కోలు పలికారు.

## ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల మార్చి 9 ( సమయం న్యూస్)** :నవాబుపేట్ మండలం కేశపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన స్థానిక శాసనసభ్యులు శ్రీ కాలే యాదయ్య .ఈ సందర్భంగా శాసనసభ్యులు శ్రీ కాలే యాదయ్య మాట్లాడుతూ కేశపల్లి గ్రామంలో పేద ప్రజలకు గౌరవప్రదమైన జీవితం అందించాలనే లక్ష్యంతో నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించడం నాకు చాలా ఆనందంగా ఉంది. ఒక కుటుంబానికి ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు కాదు... అది వారి భవిష్యత్తుకు బలమైన పునాది.ప్రజల సంక్షేమం మా ప్రభుత్వానికి ఎప్పుడూ మొదటి ప్రాధాన్యం. అందుకే పేదలందరికీ సొంత ఇల్లు కల్పించాలనే సంకల్పంతో ఈ ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమాన్ని చేపట్టాం.ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు మరిన్ని తీసుకువచ్చి చేవెళ్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడానికి నేను ఎప్పుడూ కృషి చేస్తాను. మీ అందరి ఆశీర్వాదాలు, సహకారం ఉంటే ఇంకా మంచి పనులు చేయగలుగుతాం.ఈ ఇంటిని పొందిన కుటుంబానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ...ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా న్యాయమూర్తిని కలసిన కలెక్టర్



**మెదక్ మార్చి09( సమయం న్యూస్). :** సోమవారం గౌ:జిల్లా న్యాయమూర్తి నీలిమ గారిని వారి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మర్యాదపూర్వకంగా మొక్క అందించి కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, న్యాయ పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై స్నేహపూర్వకంగా చర్చించారు.జిల్లాలో ప్రజలకు వేగవంతమైన న్యాయ సేవలు అందించేందుకు పరిపాలన ,న్యాయ వ్యవస్థ పరస్పర సహకారంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు. అలాగే జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సేవల మెరుగుదలకు తీసుకుంటున్న చర్యల గురించి జిల్లా కలెక్టర్ వివరించారు.

# రైతు పంట వివరాలను నమోదు తప్పని సరిగచేసుకోవాలి

● **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ మార్చి09( సమయం న్యూస్). :** రైతులకు ప్రభుత్వ పథకాలు అందాలంటే పంట వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వ్యవసాయ అధికారులకు సూచించారు.మే 10 వ తేదీ లోపు అన్ని పంటల నమోదుకు చివరి తేదన్నారు.కొల్చారం మండలం అప్పాజీ పల్లి లో పంట నమోదు యాప్ పనితీరును క్షేత్రస్థాయిలో కలెక్టర్ పంట పొలాలకు వెళ్లి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంటల నమోదుకు వ్యవసాయ శాఖ గ్రామ స్థాయిలో ప్రయివేట్ సర్వేయర్ల ద్వారా డిజిటల్ పంట సర్వే కి శ్రీకారం చుట్టింది. జియో–రిఫరెన్స్ చేయబడిన కాడాస్ట్రల్ మ్యాప్లు వున్న గ్రామాలలో ప్రయివేట్ సెర్వేయేర్లూ కేంద్ర ప్రభుత్వం యాప్ లో పంట నమోదు చేస్తారు. కాడాస్ట్రల్ మ్యాప్ అందుబాటులో లేని గ్రామాలలో మండల వ్యవసాయ అధికారులు రాష్ట్ర ప్రభుత్వ యాప్ ) లో పంట నమోదు చేస్తారు అన్నారు.ప్రతి రైతు పొలం వద్దకు (వాలంటీర్) అధికారి ప్రత్యక్షంగా వెళ్లి ఫోటోలు తీసి అక్కడ నుంచే ఆన్లైన్లో నమోదు అప్లోడ్ చేసేందుకు క్రాప్ బుకింగ్ పేరుతో మొబైల్ యాప్ తీసుకువచ్చిందన్నారు పంట నమోదు వివరాలను మొబైల్ యాప్ ద్వారా పక్కాగా నమోదు చేయాలని సూచించారు.



రైతులు ఏపంట వేశారు? వాటికి ఏమైనా తెగుళ్లున్నాయా? అనేది గుర్తించి తీసిన ఫొటోను అక్కణ్నుంచే యాప్లో అప్లోడ్ చేస్తున్నట్లు వివరించారు.. జియో ట్యాగింగ్ ద్వారా ఆ సర్వే నంబరు పొలం నుంచే అప్లోడ్ చేశారా? లేదా అనేది వ్యవసాయశాఖ గుర్తిస్తుందని చెప్పారు. జిల్లాలో 2,85,774 ఎకరాలకు గాను ఇప్పటి వరకు 39827 ఎకరాలు నమోదు చేసినట్లు తెలిపారుఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ ఏఈవోలు రైతులు పాల్గొన్నారు

# అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి.

● **రాష్ట్రమహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓజా.**

**మెదక్ మార్చి09( సమయం న్యూస్).:** అంగన్వాడీలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఐసిడిఎస్ డైరెక్టర్ శృతి ఓజా తెలిపారు నర్సాపూర్ రెడ్డిపల్లి అంగన్వాడి సెంటర్ ను మెదక్ జిల్లా కేంద్రంలోని , బాలల సదనం సఖి కేంద్రాన్ని, ఐసిడిఎస్ డైరెక్టర్ శృతి ఓజా సోమవారం పరిశీలించారు.కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకుని జిల్లా కలెక్టర్ గారితో సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా ఆమె అన్ని అంగన్ వాడీ కేంద్రాలలో కనీస సౌకర్యాల , విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీరు – అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో 100%. ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోసఖి కేంద్రాన్ని సందర్శించండి సిబ్బందితో సమీక్షించారు ఐఎం కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలసదనం నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశాన్ని సందర్శించి 99 రోజుల్లో పూర్తి చేసే దిశగా కార్యాచరణ ప్రణాళికను తయారు చేసుకోవాలని ఆదేశించారు.. బాలసదనాన్ని సందర్శించిన సిబ్బందితో మాట్లాడుతూ , పిల్లల సంరక్షణ పిల్లలకు పోషకాహారం అందించి బలాన్ని పెంచాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూపోషకాహార సేవలను బలోపేతం చేయడం, అంగన్‌వాడీ మౌలిక సదుపాయాలను పర్యవేక్షించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని సంక్షేమ శాఖ పనితీరు ఆదర్శంగా ఉందని అంగన్వాడి సెంటర్స్, సఖి సెంటర్లలో మెరుగైన సేవలు అందుతున్నాయని చెప్పారు. ఈ



కార్యక్రమంలో డి డబ్ల్యు ఓ హేమ భార్గవి ఐసిడిఎస్ సిడిపిఓలు సూపర్వైజర్ తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

**-- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య**

**సంగారెడ్డి,మార్చి 9( సమయం న్యూస్) :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు పారిశుధ్యం, విద్యార్థులకు అందే సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఇస్నాపూర్‌లోని జెడ్పీ హైస్కూల్ మరియు డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం, పారిశుధ్యం, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి చేస్తుందన్నారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు చదువుపై మరింత దృష్టి సారించాలని సూచించారు. హాల్ టికెట్లు అందాయా, అందులో వివరాలు సరిగ్గా ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు రివిజన్ చేస్తున్నారా అని ప్రశ్నిస్తూ ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన షెడ్యూల్ సరిగా అమలు కావడం లేదని గుర్తించిన కలెక్టర్, సంబంధిత సంస్థకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు గుడ్లు అందించడం లేదని గమనించి, వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల హెడ్‌మాస్టర్ అనుమతి లేకుండా గైర్హాజరు కావడంపై ఆగ్రహించిన కలెక్టర్ హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, అదేవిధంగా కొంతమంది ఉపాధ్యాయులు గైర్హాజరు



కావడం పై ఎంఈఓ వివరణ ఇవ్వాలని, పర్యవేక్షణ లోపించినందుకు ఎంఈఓకు కూడా షోకాజ్ నోటీసు ఇవ్వాలని జిల్లా విద్యాధికారికి సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని కలెక్టర్ స్పష్టం చేసారు. శానిటేషన్ గ్రాంట్ కింద ఎంత మందిని ఎంగేజ్ చేసుకుంటున్నారో, వారి పేర్లు, ఎప్పటి వరకు పేమెంట్ చేశారన్న వివరాలను అందించాలని సూచించారు.పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేకపోవడం , డైనింగ్ హాల్ సరిగా శుభ్రం చేయకపోవడం పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డును పరిశీలించిన కలెక్టర్, అక్కడ మంటలు చెలరేగిన ప్రాంతాన్ని 24 గంటల్లో వాటర్ ట్యాంకర్ల సహాయంతో పూర్తిగా ఆర్పివేయాలని ఆదేశించారు. సెగ్రిగేషన్ ప్రాంతంలో ఉన్న లెగసీ వ్యర్థాలను 48 గంటల్లో పూర్తిగా తరలించి ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయాలని సూచించారు.డంపింగ్ యార్డ్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అక్రమంగా చెత్త వేయకుండా 24 గంటల పర్యవేక్షణ ఉండేలా ఒక కార్మికుడిని నియమించాలని ఆదేశించారు. అలాగే వ్యర్థాలను సేకరించే మున్సిపల్ ఆటోలు, ప్రైవేట్ వాహనాల ద్వారా చెత్తను ఎక్కడ ప్రాసెస్ చేస్తున్నారు, ఎక్కడికి తరలిస్తున్నారు అనే అంశంపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఆయా అంశాలపై వెంటనే చర్యలు తీసుకొని యాక్షన్ టేకన్ రిపోర్ట్ ను సమర్పించాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. ఈ సందర్శనలో కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్ పర్సన్ సుమలత, మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మహిళలు హక్కులు గురించి తెలుసుకోవాలి

● **మహిళలు ఉపాధితో పాటు పారిశ్రామిక వేత్తలుగా అన్ని రంగాలలో ముందు ఉండాలి**

● **OMIF జిల్లా కోఆర్డినేటర్ కె నారాయణ**

**కోయిలకొండ మండలం, మార్చి,09(సమయం న్యూస్) :** కోయిలకొండ మండలంలో OMIF సవస్థ అధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం కార్యక్రమం నిరవహించి నాఎఱట జిల్లా కోఆర్డినేటర్ కె నారాయణ మాట్లడుతూ మహిళాలు ఉపాధి తో పాటు పారిశ్రామిక వెత్తలుగా. అన్నిరంగాలలో ముందుండాలని సమానత్వం మరియూ స్వేచ్ఛ కోసం కృషిచేయాలని మహిళలపై అఘాయిత్యాలు హింస కు వ్యతిరేకంగా ఉద్యమించాలని ప్రతి ఒక్కరూ చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని మహిళలు సాధించలేనిది ఏమీ లేదని పురుషులతో పాటు మహిళలకు భారత రాజ్యాంగంలో సమాన హక్కులు కల్పించ బడ్డవి. లింగ వివక్ష లేని సమాజం కోసం మహిళలు చైతన్యం కావాలని మాట్లాడటం



జరిగింది పాల్గొన్న వారు వార్డు మెంబర్ లు సిరి నాగేష్ అంగన్వాడీ టీచర్ లక్మి కమిటీ లీడర్ వెంకటమ్మ OMIF. ఆరోగ్య కార్యకర్తలు నాగమణి శారద లాలమ్మ సుమిత్రా స్వాతి టైలరింగ్ టీచర్ లక్ష్మీ గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- రాష్ డ్రైవింగ్ ప్రమాదకరం
- ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి
- మైనర్లు వాహనాలు నడపవద్దు
- గజ్వేల్ సిఐ రవికుమార్



**సమయం న్యూస్ గజ్వేల్ మార్చి 9 :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రంలో విద్యార్థిని విద్యార్థులు చదువుకునే పాఠశాలలు విద్యాలయాల వద్ద, పలువురు యువకులు ద్విచక్ర వాహనాలపై రాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాద భరితంగా వివిధ భంగిమల్లో ద్విచక్ర వాహనాలను నడిపిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన పలువురు యువకులను ఉద్దేశించి వారి వీడియోలను సోమవారం వివిధ సోషల్ మీడియా గ్రూపుల్లో గజ్వేల్ కు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్తలు పోస్ట్ చేశారు ఈ విషయాన్ని గమనించిన గజ్వేల్ సిఐ రవికుమార్ పోలీస్ బృందంతో వెళ్ళి రాష్ డ్రైవింగ్ చేస్తూ వీడియోలు తీసిన యు-వకులను వెంటనే అదుపులోకి తీసుకొని, వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు, ఈ సందర్భంగా సిఐ రవికుమార్ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని, మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపితే, చట్టపరమైన చర్యలు చేపడతామని, ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని రోడ్డు నియమాల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు, కాగా ద్విచక్ర వాహనాన్ని రాష్ గా నడిపిస్తూ ప్రమాద భరితంగా ఇతరులకు ఇబ్బంది పెట్టే విధంగా వీడియోలు తీసిన యువకులను వెంటనే పట్టుకొని వారికి కౌన్సిలింగ్ ఇచ్చి వదిలిపెట్టిన సీఐ రవికుమార్ కు పలువురు అభినందనలు తెలిపారు

# 135 పాఠశాలల్లో 6000 పైబడిన విద్యార్థులు మోటివేషనల్ సెషన్ వీక్షణ

**నారాయణపేట, మార్చి,09(సమయం న్యూస్):** నారాయణపేట:లి రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థుల కోసం నిర్వహించిన ప్రత్యేక లిమోటివేషనల్ మరియు గైడెన్స్ సెషన్‌లి కార్యక్రమాన్ని నారాయణపేట జిల్లాలో విజయవంతంగా వీక్షించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి లిడా. గోవిందరాజులి తెలిపారు. జిల్లాలోని లి135 పాఠశాలల్లో 6000 పైబడిన 10వ తరగతి విద్యార్థులు తమ ఉపాధ్యాయులతో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారుఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి లియోగితా రాణా, ×ూూ మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు భయం మరియు ఒత్తిడికి లోనవకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. సమయపాలనతో చదువును ప్రణాళికాబద్ధంగా కొనసాగిస్తూ పాఠ్యాంశాలను తరచూ పునశ్చరణ చేసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుని క్రమశిక్షణతో శ్రమిస్తే విజయం సాధించడం సులభమని పేర్కొన్నారు. అలాగే ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సానుకూల దృక్పథంతో పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు.లిడైరెక్టర్ నవీన్ నికోలస్‌లి మాట్లాడుతూ విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు లిఅభ్యాస దీపికల వినియోగాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలనిలి సూచించారు. పరీక్షల మధ్యలో వచ్చే గ్యాప్ రోజులను సద్వినియోగం చేసుకునేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తే విద్యార్థులు మరింత మంచి ఫలితాలు సాధించగలరని తెలిపారు.లిఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేష్‌లి మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో విద్యార్థుల కోసం లివేక్ అప్ కాల్స్ మరియు రెమిడియల్ టీచింగ్ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయనిలి తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులు సమయపాలన పాటిస్తూ పాఠ్యాంశాలను పునశ్చరణ చేయాలని, సరైన నిద్ర తీసుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రశాంతంగా పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. భయం లేదా ఆందోళనకు లోనవకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలను రాస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు.కార్యక్రమంలో నిర్వహించిన లిప్యానెల్ డిస్కషన్‌లో నారాయణపేట జిల్లా నుండి పీఎం పెద్దకడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి పాల్గొని జిల్లాలో 10వ తరగతి విద్యార్థుల కోసం అమలు చేస్తున్న ప్రత్యేక అకడమిక్ కార్యక్రమాలు, అదనపు తరగతులు, మాక్ పరీక్షలు మరియు పరీక్షల సన్నాహక కార్యక్రమాల సమాహారాన్ని వివరించారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ప్రేరణనిచ్చినందుకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా గారికి జిల్లా విద్యాశాఖాధికారి డా. గోవిందరాజు కృతజ్ఞతలు తెలిపారులి. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నూతన ఉత్సాహం పెరిగి పరీక్షలకు మరింత ధైర్యంగా సిద్ధమవుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.జిల్లాలోని అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూడా తమవంతుగా విద్యార్థులను ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం చేయడంలో నిమగ్నమయ్యారని ఈ విద్యా సంవత్సరం మరిన్ని మంచి ఫలితాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.




# భూదాన భూ బాధితులకు కవిత పరామర్శ

- ఈ స్థలంలోనే ఇల్లు కట్టించాలని , కలెక్టర్ రావాలని డిమాండ్
- అంబేద్కర్ విగ్రహం ఎదుట మూడు గంటల ధర్నా
- కవితతో పాటు విశారదన్ ను అదుపులో తీసుకున్న పోలీసులు



**ఖమ్మం , మార్చి 9 : ( సమయం న్యూస్ )** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సోమవారం వెలుగుమట్ల ప్రాంతంలోని భూదాన భూ బాధితులకు అంబేద్కర్ భవనంలో పరమార్శ అనంతరం అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎస్సీ ఎస్టీ బీసీ సంఘం నాయకుడు విశారదన్ తో కలిసి , మూడు గంటల పాటు బైఠాయించి , తలపెట్టిన ధర్నా ఉద్రిక్త పరిస్థితులు సృష్టించడం , భారీ ఎత్తున రెండు పైపుల ట్రాఫిక్ జామ్ కావడం నేపథ్యంలో పోలీసులు అరెస్ట్ చేసి , ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్కు తరలించారు. అనుకున్న సమయం కు ఆలస్యంగా బిఆర్ అంబేద్కర్ భవనంలో ఆశ్రయం పొందుతున్న భూదాన భూ బాధితులను కవిత పరామర్శించారు. బాధితులకు వెలుగుమట్లలోని భూదాన భూమి లోనే ఇల్లు కట్టించాలని , జిల్లా కలెక్టర్ రావాలని డిమాండ్ చేశారు. బాధితులకు సంపూర్ణ న్యాయం జరిగే వరకు తమ ఆందోళన , మద్దతు కొనసాగుతుందని ప్రకటించారు. ప్రభుత్వమంటే ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడానికి ఖమ్మం జిల్లా ప్రజల సహకారం ఎంతో ఉందని పేర్కొన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ ప్ర జల సమస్యలను పరిష్కరించలేకపోవటం విచారకరం అన్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా వచ్చి , సమస్యను పరిష్కరించాలని సూచించారు. కలెక్టర్ బదులు ఆర్డిఓ రావడం సమస్య పరిష్కారం కాదన్నారు.ఇదే సమయంలో ఎస్సీ ఎస్టీ బీసీ సంఘం నాయకులు విశారాధన్ మహారాజ్ ఇక్కడకు చేరుకొని , తమ కార్యకర్తలతో పాటు నినాదాలు చేశారు. బాధితులకు సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కవిత , విశారాధన్ లు కొద్దిసేపు అంబేద్కర్ భవనం ప్రాంగణంలో ప్రసంగాలు చేశారు. అనంతరం అక్కడే నుండి జిల్లా పరిషత్ సెంటర్లో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట బైఠాయించి , ధర్నా తలపెట్టారు. సుమారు మూడు గంటల పాటు ధర్నా కొనసాగింది. ఆందోళనకారులు , పోలీసులు మధ్య తోపులాట జరిగింది. మూడు గంటల సమయం వరకు ధర్నా కొనసాగడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడిన నేపథ్యంలో రోడ్డుకు ఇరవైపులా ట్రాఫిక్ జామ్ అయింది. ఆఖరికి పోలీసులు సుమారు 25 మంది ఆందోళనకారులను , కవిత విశారదన్ లను అరెస్ట్ చేసి , ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# నేడు కొడంగల్ మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం

- విద్యుత్ అధికారులు ఎఈ,ఎడిఇ కొడంగల్

**కొడంగల్ మండలం, మార్చి,09(సమయం న్యూస్) :** విద్యుత్ సరఫరా అంతరాయం కొడంగల్ మండలంలోనిపెద్దనంది గామ కొత్త 33ఖ౦ లైన్ పనుల కారణంగా కొడంగల్ మండలంలోని పెద్దనందిగామ,చిన్న నందిగామ, ప్యాలమద్ది, హుస్సేన్ పూర్, బుర్జుక న్పల్లి గ్రామాలకు మధ్యాన్నం 2:00 నుండి సాయంత్రశీ 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడును. అంగడి రైచూర్ గ్రామంలో విద్యుత్ దీపాల మరమ్మతుల దృష్ట్యా నాలుగు రోజులు అనగా 10.03.2026 నుండి 13.03.2026 వరకు ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునుకావున వినియోగదారులు సహకరించాలని మనవి.ఏఈ,ఎడిఇ కొడంగల్ వికారాబాద్ జిల్లా

# కోస్గి అభివృద్ధికి కలిసికట్టుగా పాటుపడదాం.

- కోస్గి మున్సిపల్ చెర్మెన్ నాగులపల్లి నరేందర్




**కోస్గి మున్సిపల్, మార్చి,09(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కోస్గి సమగ్ర అభివృద్ధికి అందరం కలిసికట్టుగా పాటుపడుదామని కోస్గి మున్సిపల్ చైర్మన్ నాగులపల్లి నరేందర్ అన్నారు.సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 5కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి శివాజీ చౌరస్తా వరకు మున్సిపల్ సిబ్బంది,స్థానిక యువత తో కలిసి 5కే రన్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోస్గి పట్టణ పరిశుభ్రతత కోసం అందరం కలిసి కృషి చేయాలని కోరారు.ప్రజాల సహకారంతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు.పట్టణంలో ఎక్కడ చెత్త,మురికి నిల్వలు లేకుండా మున్సిపల్ సిబ్బంది,అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.ఈకార్యక్రమంలో కమిషనర్ నాగరాజు,వైస్ చైర్ పర్సన్ చింతల సరితా, కౌన్సిలర్లు మేకల రాజేష్, భానునాయక్,మాస్టర్ శ్రీనివాస్,నాయకులు బాలరాజు, బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబు ని కలిసిన చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ భీమ్ భరత్



**చేవెళ్ల మార్చ్ 9 ( సమయం న్యూస్) :** చేవెళ్ల నియోజకవర్గం లోని నవాబ్ పేట మండలం లోని గ్రామ పంచాయతీల అభివృధి పనుల కోసం నిధులు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి వర్యులు, జిల్లా ఇంచార్జి మంత్రి గౌరవ శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు గారిని మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేసిన చేవెళ్ళ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి ఆయా సంబంధిత జిల్లా కలెక్టర్ గారికి తెలపడం జరిగింది .ఈ కార్యక్రమంలో వీరితో పాటుగా పాల్గొన్న మండల అధ్యక్షులు వెంకటయ్య , నవాబ్ పెట్ సర్పంచ్ నరసింహ రెడ్డి , చేవెళ్ళ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పెంట రెడ్డి , పులు మామిడి సర్పంచ్ నర్సింలు , నరేగూడ సర్పంచ్ దశరథ్ , చించల్ పెట్ సర్పంచ్ అనంత రాములు , యావాపూర్ సర్పంచ్ లక్ష్మణ్, తిమ్మారెడ్డిపల్లి సర్పంచ్ ప్రభాకర్ , గంగ్యాడ సర్పంచ్ మల్లేష్ , పూలపల్లి శ్రీనివాస్ రెడ్డి , మహేందర్ రెడ్డి , ఉపేందర్ రెడ్డి , శ్రీనివాస్ ,అమీర్ ఖాన్ , మిరాజ్ , పాండు రంగా రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



**చేవెళ్ల మార్చు 9 (సమయం న్యూస్) :** శంకర్పల్లి మున్సిపల్ పరిధిలోని పత్తేపూర్లో స్థానిక అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీలో సెక్యూరిటీ డ్యూటీ చేస్తున్నటువంటి టంగుటూరు గ్రామానికి చెందిన బుజ్జి కింది నర్సింలు ఆదివారం రాత్రి డ్యూటీ ముగించుకొని టంగుటూరు గ్రామానికి తిరుగు ప్రయాణం అవుతుండగా ఫతేపూర్ వద్ద టాటా అరియర్ వెహికల్ నెంబర్ టిఎస్ 07 హెచ్ డబ్ల్యు 9 0 7 7 అధిక వేగంతో వచ్చి టీఎస్ 34 ఎఫ్ 8759 ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా టంగుటూరు గ్రామానికి చెందిన బుజ్జు కింద నర్సింలు 45 సంవత్సరాలు అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్య లలిత ఫిర్యాదు మేరకు శంకరపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# లక్ష లీటర్ల వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బోడి వెంకటరెడ్డి



**దౌల్తాబాద్ మండలం, మార్చి,09(సమయం న్యూస్) :** కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండల కేంద్రంలో 40 లక్షల రూపాయల తో లక్ష లీటర్ల వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బోడి వెంకట్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగం వీరన్న,సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ మరియు వార్డు మెంబర్లు, నాయకులు

# పామెనలో సంస్కృతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఉత్సాహంగా క్రీడా పోటీలు



**చేవెళ్ల మార్చ్ 9 ( సమయం న్యూస్) :** న్యూ ఈడెన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని పామెనలో "సంస్కృతి ఇంటర్నేషనల్ స్కూల్"లో క్రీడా పోటీలు రెండో రోజు కూడా ఉత్సాహంగా కొనసాగాయి. ఈ పోటీలను ప్రముఖ నటుడు, యాంకర్ పామెన రవి అలియాస్ 'బిత్తిరి సత్తి', పామెన కౌన్సిలర్ గోపాల్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి క్రీడలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వం పెంపొందించడంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందేందుకు దోహదపడతాయని తెలిపారు. చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించగలరని అన్నారు.పోటీలలో వివిధ క్రీడా విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్స్ రెహానా, సుకన్య, కరస్పాండెంట్ శశిపాల్ రెడ్డి, డైరెక్టర్లు గాలయ్య, సుజాత, రఘునాథ్ రెడ్డి, నరసింహ గౌడ్, మహేందర్ రెడ్డి, నిరంజన్ బాబు తదితరులు పాల్గొన్నారు.




# భార్యకు సంజు ఎమోషనల్ మెసేజ్..

## వరల్డ్ కప్ హీరో మనసులో మాట ఇదే!

**ఢిల్లీ:** 2026 టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు చారిత్రాత్మక విజయం సాధించిన వేళ, టీమిండియా స్టార్ బ్యాటర్ సంజు శామ్సన్ తన అద్భుత ప్రదర్శనతో యావత్ క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. ఈ టోర్నీలో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచాడు సంజు. న్యూజిలాండ్‌తో జరిగిన ఏకపక్ష ఫైనల్లో భారత్ ఘనవిజయం సాధించడంలో సంజు శామ్సన్ కీలక పాత్ర పోషించారు. ఈ టోర్నీలో మొత్తం 321 పరుగులు చేసి భారత్ తరపున టాప్ స్కోరర్‌గా నిలిచిన సంజు, తన కెరీర్ లోనే అత్యుత్తమ ఫామ్ ను ప్రదర్శించారు. ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన తర్వాత సంజు తన భార్యతో దిగిన ఫోటోను షేర్ చేస్తూ ఒక ఎమోషనల్ నోట్ రాశారు. ఈ నోట్‌లో వరల్డ్ కప్ హీరో సంజు మనసులో మాట ఏంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం. ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన తర్వాత సంజు తన సక్సెస్ వెనుక ఉన్న అసలు శక్తి తన భార్య చారులత అని పేర్కొంటూ సోషల్ మీడియాలో చేసిన భావోద్వేగ పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. "మనం కలిసిన రోజు నుంచి నేటి వరకు.. నా ప్రతి అడుగులో నాకు అండగా నిలిచినందుకు ధన్యవాదాలు. బయటి ప్రపంచం నన్ను ఎలా చూసినా, నాలోని మంచిని, చెడును చూసి కూడా నా పక్కనే బలంగా నిలబడ్డావు. నా జీవితంలో క్రికెట్ ప్రాముఖ్యతను గుర్తించి, దానికి తగిన గౌరవం ఇచ్చినందుకు థాంక్స్. ఈ అద్భుత క్షణం కోసం నేను ఎంతగా ఎదురుచూశానో, నువ్వు కూడా అంతే ఆరాటపడ్డావు. థాంక్యూ డియర్" అంటూ రాసుకొచ్చారు. ఇదే సమయంలో వరల్డ్ కప్ హీరోగా కేరళకు తిరిగి రానున్న సంజు శామ్సన్‌కు ఘన స్వాగతం పలికేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. కేరళ క్రీడా శాఖ మంత్రి వి.శివన్‌కుట్టి స్పందిస్తూ, సంజును రాష్ట్ర ప్రభుత్వం తరపున ఘనంగా సత్కరిస్తామని ప్రకటించారు. త్వరలోనే ఈ సన్మాన కార్యక్రమ వివరాలను వెల్లడించనున్నట్లు తెలిపారు.

# పీసీబీ పరువు తీసిన షోయబ్ అక్తర్!

## భారత క్రికెట్ వ్యవస్థకు సలాం అంటూ షాకింగ్ కామెంట్స్





**ఢిల్లీ:** 2026 టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు అద్భుత విజయంపై పాకిస్థాన్ మాజీ ప్లేయర్ షోయబ్ అక్తర్ ప్రశంసల వర్షం కురిపించాడు. టీమిండియా అద్భుత ప్రదర్శనను కొనియాడుతూనే, తన సొంత దేశపు క్రికెట్ బోర్డు పరువు తీశాడు. భారత యువ జట్టు ప్రపంచ ఛాంపియన్‌గా నిలవడంపై షోయబ్ అక్తర్ స్పందిస్తూ, ఇది కేవలం ఆటగాళ్ల విజయం మాత్రమే కాదని, భారత క్రికెట్ వ్యవస్థ సాధించిన విజయమని అభివర్ణించారు. మెరిట్ ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడంలో బీసీసీఐ అనుసరిస్తున్న విధానమే భారత్‌ను విశ్వవిజేతగా నిలిపిందని కొనియాడాడు.

### సంజు శామ్సన్ ప్రదర్శనపై ప్రశంసలు..

ముఖ్యంగా ఈ టోర్నీలో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచిన సంజు శామ్సన్‌ను అక్తర్ ప్రత్యేకంగా అభినందించారు. "అవకాశం ఆలస్యంగా వచ్చినా, కేవలం 4-5 మ్యాచ్‌ల్లోనే అద్భుత ప్రదర్శన చేసి టోర్నీలోనే అత్యుత్తమ ఆటగాడిగా నిలవడం సామాన్యం కాదు. సంజు ఈ అవార్డుకు 100 శాతం అర్హుడు" అని కొనియాడాడు. ఇషాన్ కిషన్ తన ప్రతిభను మరోసారి నిరూపించుకున్నాడని, ఫైనల్‌లో అభిషేక్ శర్మ ఆడిన మెరుపు ఇన్నింగ్స్ జట్టును గెలిపించిందని అక్తర్ ప్రశంసించాడు. టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తీసుకున్న సాహసోపేత నిర్ణయాలే ఈ విజయానికి పునాది అని అక్తర్ విశ్లేషించాడు. "సీనియర్లను పక్కన పెట్టి యువ ఆటగాళ్లపై నమ్మకం ఉంచడం ఒక సాహసం. ఆ నమ్మకాన్ని గంభీర్ అండ్ కో నిలబెట్టుకుంది. టీమ్ మేనేజ్‌మెంట్ తీసుకున్న ధైర్యమైన నిర్ణయాలే భారత్‌కు ట్రోఫీని అందించాయి" అని అన్నాడు.

### పీసీబీకి చురకలు..

ఇదే క్రమంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డుపై అక్తర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. "సరైన ప్రతిభను గుర్తించడంలో, యువతకు అవకాశాలివ్వడంలో బీసీసీఐని చూసి పీసీబీ చాలా నేర్చుకోవాలి. మెరిట్ పక్కన పెట్టి నిర్ణయాలు తీసుకుంటే ఫలితాలు ఎలా ఉంటాయో పాకిస్థాన్ క్రికెట్‌ను చూస్తే అర్థమవుతుంది" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశాడు.

# ఇషాన్ కిషన్ గర్ల్ ఫ్రెండ్ ఎవరో తెలుసా!

## ఇంత ఏజ్ గ్యాపా?



**ఢిల్లీ:** టీమిండియా స్టార్ క్రికెటర్ ఇషాన్ కిషన్ వ్యక్తిగత జీవితం మరోసారి వార్తల్లో నిలిచింది. ముఖ్యంగా ఇటీవల జరిగిన ఐసీసీ టీ20 వరల్డ్‌కప్‌ఫైనల్ సందర్భంగా అతని గర్ల్‌ఫ్రెండ్ అదితి హుండియా అందరి దృష్టిని ఆకర్షించింది. మ్యాచ్ సమయంలో స్టాండ్స్‌లో నుంచి ఇషాన్‌కు ఆమె ఉత్సాహంగా మద్దతు ఇస్తూ కనిపించింది. ఇక, భారత్ విజయం అనంతరం ఇషాన్ కిషన్ తన లేడీ లవ్‌కు ముద్దు పెట్టుకోవడం కూడా అభిమానుల దృష్టిని ఆకర్షించింది. దీంతో సోషల్ మీడియాలో అదితి హుండియా గురించి విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో ఇషాన్ కిషన్ మనసు దోచిని అదితి హుండియా ఎవరు? ఆమె నేపథ్యం ఏంటి? అనే చర్చ సాగుతుండగా.. ఆమెది జైపూర్.. ఆమె వృత్తిరీత్యా మోడల్ మరియు ఫ్యాషన్ ఇన్‌ఫ్లుయెన్సర్. ఆమె తండ్రి జైపూర్‌లో ప్రముఖ వ్యాపారవేత్తగా గుర్తింపు పొందిన వ్యక్తి. ఫ్యాషన్ ప్రపంచంలో అదితి తన అందం, స్టైల్ మరియు ఆకర్షణీయమైన చిరునవ్వుతో మంచి గుర్తింపు సంపాదించింది. అదితి 2018లో జరిగిన మిస్ దివా 2018 పోటీలో విజేతగా నిలిచింది. అంతకుముందు ఫెమినా మిస్ ఇండియా పోటీలో ఫైనలిస్ట్‌గా కూడా నిలిచింది. ఆ తరువాత ఆమె ఫ్యాషన్ రంగంలో అడుగుపెట్టి అనేక మోడలింగ్ ప్రాజెక్టుల్లో పాల్గొంది. అంతేకాదండోయ్.. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు లక్షలాది మంది అభిమానులు ఉన్నారు. ప్రస్తుతం ఆమెకు సుమారు 3.7 లక్షల ఫాలోవర్లు ఉన్నారు. ఫ్యాషన్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మాత్రమే కాకుండా కంటెంట్ క్రియేటర్‌గా కూడా ఆమె మంచి గుర్తింపు పొందింది. చాలామందికి తెలియని విషయం ఏమిటంటే అదితి ఒక వ్యాపారవేత్త కూడా. ఆమెకు స్వంతంగా ఒక ఫ్యాషన్ లేబుల్ ఉంది. అదితి సెంట్‌స్కావీయర్స్‌కాలేజీ నుంచి బీబీఏ డిగ్రీ పూర్తి చేసింది. కాలేజీ రోజుల నుంచే మోడలింగ్, ఫ్యాషన్ షోలలో పాల్గొంటూ కెరీర్‌ను ప్రారంభించింది. అదితి ప్రముఖ గాయకుడు అర్మాన్ మాలిక్ నటించిన "టూటే ఖాబ్" మ్యూజిక్ వీడియోలో కూడా కనిపించింది. 2019 ఐపీఎల్ సమయంలో ఇషాన్ కిషన్‌తో లింక్ పెడుతూ వార్తల్లో లిచింది అదితి హుండియా.. అప్పటి నుంచే వీరి ప్రేమకథ ప్రారంభమైనట్లు ప్రచారం జరిగింది. మీడియా కథనాల ప్రకారం, అదితి హుండియా ఇషాన్ కిషన్ కంటే ఏజ్‌లో కాస్త పెద్దది. ప్రస్తుతం ఇషాన్ వయసు 27 సంవత్సరాలు కాగా, అదితి వయసు 29 సంవత్సరాలు. వీరి జంటను అభిమానులు సోషల్ మీడియాలో " మేడ్‌ఫర్‌ఈచ్‌అదర్" అంటూ ప్రశంసిస్తున్నారు. మరి వీరి మధ్య లవ్ ఉందా.. అది పెళ్లి పీటల వరకు వెళ్తుందా అనేది మాత్రం వేచి చూడాలేమో..



# టీ20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత గ్యారీ కిర్‌స్టన్‌కు కొత్త బాధ్యతలు




**ఢిల్లీ:** టీ20 వరల్డ్ కప్‌లో న్యూజిలాండ్‌పై గ్రాండ్ విక్టరీ కొట్టి.. వరుసగా మూడో సారి వరల్డ్ కప్‌ను ముద్దాడింది భారత జట్టు.. అయితే, ఈ పరిణామం జరిగిన మరుసటి రోజు అంటే.. ఈ రోజు దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్.. టీమిండియా మాజీ హెడ్ కోచ్ గ్యారీ కిర్‌స్టన్‌కు కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు.. గ్యారీ కిర్‌స్టన్‌కు రో కీలక బాధ్యత దక్కింది. శ్రీలంక క్రికెట్‌సోమవారం ఆయనను శ్రీలంక జాతీయ పురుషుల క్రికెట్ జట్టుకు కొత్త ప్రధాన కోచ్‌గా నియమించినట్లు ప్రకటించింది. ఈ నియామకం ఏప్రిల్ 15 నుండి అమలులోకి రానుంది. దక్షిణాఫ్రికాకు చెందిన మాజీ క్రికెటర్ అయిన గ్యారీ కిర్‌స్టన్ తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో విశేష గుర్తింపు పొందాడు. 2008 నుంచి 2011 వరకు ఆయన ఇండియా నేషనల్‌క్రికెట్‌టీంకుప్రధాన కోచ్‌గా పనిచేశారు. ఆ సమయంలో భారత జట్టు 2011 ఐసీసీ క్రికెట్‌వరల్డ్‌కప్‌ను గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించారు. తర్వాత 2011 నుంచి 2013 వరకు సౌత్ ఆఫ్రికా నేషనల్‌క్రికెట్‌టీంకు కూడా ప్రధాన కోచ్‌గా పనిచేశారు. ఆయన మార్గదర్శకత్వంలో దక్షిణాఫ్రికా జట్టు 2013లో క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్లలో ప్రపంచ నంబర్-1 జట్టుగా నిలిచింది. శ్రీలంక క్రికెట్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, కొత్త ప్రధాన కోచ్ నియామకం జాతీయ హై పెర్ఫార్మెన్స్ వ్యవస్థను బలోపేతం చేసే కార్యక్రమంలో భాగమని తెలిపింది. ఇటీవల గ్యారీ కిర్‌స్టన్ నమిబియా నేషనల్‌క్రికెట్ టీంతో కన్సల్టెంట్‌గా పనిచేశారు. ఐసీసీ మెన్స్‌టీ20 వరల్డ్‌కప్2026 సందర్భంగా నమీబియా జట్టుకు మార్గనిర్దేశం చేశారు. క్రీడాకారుడిగా 1993 నుంచి 2004 వరకు కొనసాగిన తన కెరీర్‌లో కిర్‌స్టన్ టెస్ట్ మరియు వన్డే క్రికెట్‌లో కలిపి 14,087 పరుగులు సాధించారు. ఇందులో 21 టెస్ట్ సెంచరీలు మరియు 13 వన్డే సెంచరీలు ఉన్నాయి. ఇక, శ్రీలంక క్రికెట్‌లో ఆయన నియామకం రెండేళ్ల పదవీకాలం ఉండనుంది. ఇది ఏప్రిల్ 14, 2028 వరకు కొనసాగుతుంది. ఈ సమయంలో ఆయన ప్రధాన బాధ్యతల్లో ఒకటి ఐసీసీ మెన్స్‌క్రికెట్‌వరల్డ్‌కప్2027కు శ్రీలంక జట్టును సిద్ధం చేయడం. ఈ టోర్నమెంట్ సౌత్‌ఆఫ్రికా, నమిబియా, జింబాబ్వేలో జరగనుంది. కాగా, టీ20 వరల్డ్ కప్‌లో శ్రీలంక పెద్దగా ప్రభావాన్ని చూపలేకపోయిన విషయం విదితమే..

# స్విస్ ఓపెన్ నుంచి సింధు ఔట్.. లక్ష్య సేన్ డౌటే..!



**ఢిల్లీ:** ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఆడలేకపోయిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు కీలక నిర్ణయం తీసుకుంది. తీవ్ర భయాందోళన మధ్య దుబాయ్ నుంచి స్వదేశం వచ్చిన సింధు.. స్విస్ ఓపెన్‌లోనూ ఆడకూడదని తీర్మానించుకుంది. మూడు రోజుల దుబాయ్‌లో బిక్కుబిక్కుమంటూ గడిపిన తను.. మానసికంగా, శారీరకంగా సన్నద్ధంగా లేనందునే స్విస్ ఓపెన్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్టు పేర్కొంది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా దుబాయ్‌లో చిక్కుకున్న పీవీ సింధు ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు దూరమైంది. మూడు రోజుల తర్వాత స్వదేశం చేరుకున్న తెలుగు తేజం ఇంకా కుదురుకోలేదు. దాంతో.. వెంటనే కోర్టులోకి దిగేందుకు ఆమె సిద్ధంగా లేదు. సో.. స్విట్జర్లాండ్ ఓపెన్ టోర్నమెంట్ నుంచి వైదొలగాలని సింధు నిర్ణయించుకుంది. రెండోసారి కూడా ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో కంగుతిన్న లక్ష్య సేన్ సైతం ఈ పోటీల్లో ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. మార్చి 10 నుంచి మొదలయ్యే ఈ ఈవెంట్‌కు తాను అందుబాటులో ఉండడని ఆమె తెలిపింది. స్విట్జర్లాండ్‌లోని సెయింట్ జకొబ్‌షల్లేలో మార్చి 10వ తేదీ నుంచి మార్చి 15 వరకూ స్విస్ ఓపెన్ జరుగనుంది.



# త్రిషకు పార్తీబన్ క్షమాపణలు

ఇటీవల చెన్నైలో జరిగిన ఓ ఈవెంట్‌లో త్రిషను ఉద్దేశించి నటుడు, దర్శకుడు పార్తిబన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. దీనిపై త్రిష కూడా పరోక్షంగా స్పందించడంతో ఆయన మరో పోస్ట్ పెట్టారు. ఈ విషయంలో జరిగినదంతా తప్పుగా భావించారు. ఇప్పుడు నాకు పశ్చాత్తాపపడటం తప్ప మరో మార్గం లేదని తన పోస్ట్‌లో రాశారు. దీంతో ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పడినట్లు అయింది.అసలేం జరిగిందంటే.. గత కొన్ని రోజులుగా త్రిష ప్రేమకు సంబంధించిన రూమర్స్ వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె కోలీవుడ్ అగ్ర కథానాయకుడు విజయ్‌తో కలిసి ఓ వివాహ వేడుకకు హాజరుకావడం ఆ వార్తలకు మరింత బలం చేకూరింది. ఓ ఈవెంట్‌లో త్రిష గురించి పార్తిబన్ మాట్లాడుతూ.. ఆమె కొన్ని రోజులు ఇంట్లోనే ఉండటం మంచిది. ఎందుకంటే ఆమె బయటకు వస్తే ఎక్కడ లేని సమస్యలు వస్తున్నాయని అన్నారు. ఈ వ్యాఖ్యలపై త్రిష పరోక్షంగా స్పందించారు. 'చేతిలో మైక్ ఉంది కదా అని మాట్లాడితే కామెడీ అవ్వదు. అది కేవలం మూర్ఖత్వమే' అని పోస్ట్ పెట్టారు.

## సూపర్ మ్యాన్ తరహా స్టోరీతో
# అల్లు అర్జున్



అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ – మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్ కలయికలో సినిమా ఎప్పట్నుంచో ప్రచారంలో ఉంది. సూపర్‌మ్యాన్ తరహా కథతో సినిమా తెరకెక్కే అవకాశం ఉన్నట్టు కూడా పరిశ్రమలో చర్చ సాగింది. అయితే అల్లు అర్జున్ వరుసగా తమిళ దర్శకుడు అట్లీ, లోకేశ్ కనగరాజ్‌లతో సినిమాలకు పచ్చజెండా ఊపడంతో, బసిల్ జోసెఫ్‌తో సినిమా గురించి చర్చకు బ్రేక్ పడింది. ఇటీవల జరిగిన అల్లు శిరీష్ పెళ్లి వేడుకకు బసిల్ జోసెఫ్ హాజరు కావడంతో మరోసారి ఆయన, అల్లు అర్జున్ కలయికలో సినిమా తెరపైకొచ్చింది. ఇద్దరూ కలిసి సినిమా చేయడం ఖాయమనే సంకేతాలు వచ్చినట్లైంది. బసిల్ జోసెఫ్ మలయాళంలో కథానాయకుడిగా నటిస్తూనే, దర్శకుడిగా పలు విజయాల్ని అందుకున్నారు.



# సల్మాన్‌కు జోడీగా నయనతార

దక్షిణాదిన అగ్రస్థానంలో ఉన్న కథానాయిక ఎవరంటే.. 'నయనతార' అని టక్కున చెప్పేస్తారు. పారితోషికం పరంగా కూడా నయనే నంబర్ వన్. ప్రస్తుతం ఆ భాష, ఈ భాష అని లేకుండా, అన్ని భాషల్లోనూ సినిమాలు చేస్తూ సత్తా చాటుతున్నది నయనతార. మెగాస్టార్‌తో ఆమె రీసెంట్ హిట్ 'మన శంకర వరప్రసాద్‌గారు' టాలీవుడ్ రీజనల్ సినిమాల్లో నంబర్‌వన్ హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం బాలకృష్ణ 'ఎన్‌బికె 111'లో కథానాయికగా నటిస్తున్నది నయనతార. ఇక తమిళంలో అయితే.. ఆమె చేతిలో చాలా సినిమాలున్నాయి. ఇదిలావుంటే.. రీసెంట్‌గా ఓ బాలీవుడ్ సినిమాకు నయన్ సైన్ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్‌ఖాన్ హీరోగా రూపొందనున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి టాలీవుడ్ డైరెక్టర్ పైడిపల్లి వంశీ దర్శకుడు. దిల్‌రాజు నిర్మిస్తారట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానున్నది. ఇక నయన్ నటించిన తమిళ చిత్రం 'ముక్తీ అమ్మన్' సమ్మర్‌లో విడుదల కానుంది.

## చిన్న పిల్లలపై అత్యాచారాలు
# అరికట్టాల్సిందే

### సరస్వతి సినిమా ప్రమోషన్స్‌లో వరలక్ష్మి శరత్ కుమార్



తెలుగు, తమిళ సినీ పరిశ్రమల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా మంచి గుర్తింపు పొందిన వరలక్ష్మి శరత్ కుమార్ తాజాగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల ఆమె ప్రధాన పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహించిన సరస్వతి సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో చిన్నారులపై జరిగే అత్యాచారాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులు సమాజానికి పెద్ద ప్రమాదంగా మారుతున్నాయని ఆమె అన్నారు. అలాంటి నేరాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 'చిన్న పిల్లలను హరాస్ చేసే వాళ్లను, అత్యాచారం చేసే వాళ్లను అసలు వదిలిపెట్టకూడదు. వాళ్లకు సాధారణంగా మరణశిక్ష ఇవ్వడం సరిపోదు. అలాంటి వాళ్లకు మరింత కఠినమైన శిక్షలు ఉండాలి, కట్ చేసి పడేయాలి' అని వరలక్ష్మి పేర్కొన్నారు. నేను ఎప్పుడైనా ముఖ్యమంత్రి అయితే రేప్ లాంటి నేరాలకు పాల్పడే అబ్బాయిలకు కఠినమైన శిక్ష విధించేలా ప్రత్యేక చట్టం తీసుకువస్తాను. అప్పుడు అలాంటి నేరాలు చేయడానికి కూడా వాళ్లు భయపడతారు. సమాజంలో ఆ భయం రావాలి అని ఆమె అన్నారు. అదే సమయంలో పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు కూడా జాగ్రత్తగా ఉండాలని వరలక్ష్మి సూచించారు. చిన్నారులకు చిన్నప్పటి నుంచే 'గుడ్ టచ్', 'బ్యాడ్ టచ్' గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పిల్లలకు ధైర్యం ఇవ్వడం, ఏదైనా తప్పు జరిగితే చెప్పేలా వారికి నమ్మకం కల్పించడం ఎంతో ముఖ్యమని ఆమె అభిప్రాయపడ్డారు. ఇక వరలక్ష్మి శరత్‌కుమార్ నటించిన సరస్వతి సినిమా చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడుల నేపథ్యంలో రూపొందిన సామాజిక అంశాలతో కూడిన చిత్రంగా తెరకెక్కింది. ఈ సినిమాతో ఆమె దర్శకురాలిగా కూడా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# ట్రోల్స్ పెద్ద పదం

### ఇప్పుడిప్పుడే అలవాటు పడుతున్నా



విమర్శల నుంచి నేను చాలా నేర్చుకున్నానంటోంది హీరోయిన్ ప్రియాంక అరుళ్ మోహన్. 'మేడ్ ఇన్ కొరియా' సినిమాతో త్వరలోనే వీక్షకులందరికీ కొరియా సంస్కృతిని పరిచయం చేసే తమిళ అమ్మాయిగా ఓటీటీలో సందడి చేయనుంది. ఈ సందర్భంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె సామాజిక మాధ్యమాల్లో తనపై వస్తున్న ట్రోల్స్ గురించి స్పందించింది. 'సోషల్ మీడియాలో 'ట్రోల్స్' అనేది చాలా పెద్ద పదం. గతం గురించి ఆలోచించడం నాకు ఇష్టం లేదు. కానీ, ఇది చిత్రపరిశ్రమ. అనిశ్చితమైన పరిస్థితులు ఎదురవుతాయి. ఇక్కడ ఎవరికైనా ఏదైనా జరగొచ్చు. నేను దాని నుంచే చాలా నేర్చుకున్నాను. సహజంగానే ట్రోల్స్ బాధించినా ఎదగడానికి తోడ్పడతాయి. కొన్నిసార్లు మీరు పడిపోతేనే పైకి రావడానికి అలాంటివి సహాయపడతాయి. నేను ఇలాంటి ప్రతికూల పరిస్థితులను సానుకూలంగా మార్చుకుంటూ కెరీర్‌ని ముందుకు తీసుకెళ్లాలనుకుంను' అని చెప్పింది. గతంలో ప్రియాంక తనపై కొందరు ఉద్దేశపూర్వకంగానే ట్రోల్స్ చేస్తున్నట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131

# జగన్ మాటలు విడ్డూరం

**సొంత చెల్లెళ్లలకు న్యాయం చేయలేని వ్యక్తి ఆయన**

**ఆడవాళ్ల గురించి మాట్లాడితే విడ్డూరంగా ఉంది**

**జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి సవిత**

**శ్రీసత్యసాయి, మార్చి 9 :** సొంత తల్లి, చెల్లికి, చిన్నాన్న కుమార్తెకు న్యాయం చేయని వ్యక్తి వైఎస్ జగన్ అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అభివర్ణించారు. ఇంట్లో వారిని బజారు పాలు చేశారంటూ జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై మంత్రి సవిత మరోసారి నిప్పులు చెరిగారు. సోమవారం శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సవిత మాట్లాడుతూ.. వైఎస్ జగన్ మహిళల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిండు అసెంబ్లీలో తల్లి లాంటి నారా భువనేశ్వరిని అవమానించారంటూ మండిపడ్డారు. తాడేపల్లి, పులివెందులలో మహిళలపై జరిగిన అత్యాచారాలు, దారుణాలు అంతా చూశారన్నారు. మహిళా ద్రోహి సీఎం చంద్రబాబు అంటూ జగన్ మాట్లాడడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రశ్నిస్తే మహిళలపై కూడా కేసులు పెట్టారంటూ సీఎంగా జగన్ వ్యవహరించిన తీరును ఈ సందర్భంగా మంత్రి సవిత తూర్పారబట్టారు. హిందువులు, మహిళలు, బీసీల అభివృద్ధి అంటే సరిపోదంటూ జగన్‌కు చురకలంటించారు. మీ హయాంలో జరిగిన అరాచకాలపై నివేదిక తయారు చేసి గవర్నర్‌కు ఇప్పటికే అందజేశామన్నారు. ÷ాయలసీమ సాగునీటి గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నేతలకు లేదని కుండ బద్దలు కొట్టారు. వారు రాయలసీమ ద్రోహులున్నారు. ఏ రోజు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదంటూ వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డైవర్షన్ పాలిటిక్స్ కోసం వైసీపీ నాయకులు సభలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. అయితే ప్రజలు, మహిళలు చాలా క్లారిటీగా ఉన్నారు. మహిళా సాధికారత గురించి ఆలోచించింది పూలే ఆ తర్వాత డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ అని మంత్రి సవితా తెలిపారు. పృుడు ఎన్టీఆర్ తర్వాత చంద్రబాబు మాత్రమే మహిళా సాధికారత కోసం పని చేస్తున్నారని స్పష్టం చేశారు. మహిళలకు



అన్ని అంశాల్లో ప్రాధాన్యత కల్పించింది సీఎం చంద్రబాబేనని పేర్కొన్నారు. ప్రతి ఇంటా మహిళా ఎంటర్ ప్రెన్యూర్ రావాలన్నదే చంద్రబాబు లక్ష్యమని స్పష్టం చేశారు.

# కుటుంబ వ్యవస్థకు మహిళే మూలస్తంభం

- టీటీడీ జేఈవో డా. ఎ. శరత్
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు..
- 32 మందికి 'పద్మావతి అవార్డులు'
- మహతి కళాక్షేత్రంలో సందడిగా సాంస్కృతిక ప్రదర్శనలు



**తిరుపతి, మార్చి 9:** భారతీయ కుటుంబ వ్యవస్థలో మహిళ పాత్ర అత్యంత కీలకమని, పండితులకు వేదం ఎంత పవిత్రమో గృహాలకు గృహలక్ష్మి అంతటి పవిత్రమైనదని టీటీడీ జేఈవో (విద్య, వైద్యం) డాక్టర్ ఎ. శరత్ కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో టీటీడీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేఈవో జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.

**మహిళలే సమాజ మార్గదర్శకులు**

ఈ సందర్భంగా డా. ఎ. శరత్ మాట్లాడుతూ.. ప్రతి మనిషికి తల్లి మొదటి గురువని, పిల్లలకు సంస్కారాలను నేర్పడంలో మహిళల పాత్ర అమోఘమని తెలిపారు. కుటుంబం సుస్థిరంగా ఉంటేనే సమాజం మరియు దేశం ప్రగతి పథంలో సాగుతాయని పేర్కొన్నారు. టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి మాట్లాడుతూ, సనాతన ధర్మంలో మహిళలకు అత్యున్నత స్థానం ఉందని, నేటి కాలంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ సమాజ పురోగతికి తోడ్పడుతున్నారని ప్రశంసించారు.

**ముగ్గురు ప్రముఖ మహిళల సందేశం**

డిజిటల్ మహిళా సీఈవో ఆశ్లేష మాట్లాడుతూ, మహిళల్లో నిక్షిప్తమై ఉన్న శక్తి ప్రపంచానికే ఆదర్శమన్నారు. డీఆర్‌డీఓ శాస్త్రవేత్త డాక్టర్ చంద్రిక కౌశిక్ మాట్లాడుతూ, మహిళలపై ఒత్తిడి తగ్గాలంటే కుటుంబ సభ్యులు బాధ్యతలను పంచుకోవాలని సూచించారు. సమాజంలో మార్పు రావాలంటే మహిళలు తమకు తాము ప్రాధాన్యత ఇచ్చుకోవాలని ఆమె కోరారు.

**పద్మావతి అవార్డుల ప్రదానం**

టీటీడీలోని వివిధ విభాగాల్లో విశేష సేవలు అందించిన 32 మంది మహిళా ఉద్యోగులకు ఈ సందర్భంగా 'పద్మావతి అవార్డులను' ప్రదానం చేశారు. విజేతలకు 5 గ్రాముల వెండి డాలర్, జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే వచ్చే ఏడాది పదవీ విరమణ చేయనున్న 78 మంది మహిళా ఉద్యోగులను కూడా టీటీడీ అధికారులు సన్మానించారు.

**కళాకారుల ప్రదర్శనలు.. విద్యార్థుల సందడి**

వేడుకల్లో భాగంగా ఎస్వీ సంగీత కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన భరతనాట్యం, వీణా వాద్యకచేరి ప్రేక్షకులను కట్టిపడేశాయి. మహిళా ఉద్యోగుల కోసం నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, పెయింటింగ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఆనందరాజు, పీఆర్వో నీలిమ, పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.








# ప్రజారోగ్యంపై దృష్టి పెట్టండి

**పాలకల్తీ బాధితులను ఆస్పత్రిలో పరామర్శించిన షర్మిల**

**అమరావతి, మార్చి 9:** కల్తీ పాలు తాగిన ఘటనలో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం రాజమండ్రి ఆసుపత్రిలో ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యం గురించి తెలుసుకొని, బాధిత కుటుంబాలను ఓదర్చారు. ఈ ఘటనలో 11 మంది మరణించగా, ఇంకా 9 మంది ప్రాణాలతో కొట్టుమిట్టాడటం చూస్తే, రాష్ట్రంలో కనీసం స్వచ్ఛమైన పాలు కూడా అందించడంలో నిఘా పెట్టలేని ప్రభుత్వం ఉంటే ఎంత ఊడితే ఎంత అంటూ మండిపడ్డారు. ఏఐ మీద పెట్టే శ్రద్ధలో పావు వంతైనా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజారోగ్యం మీద పెట్టాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. జనాభా కనమని చెప్పడం కాదు. ఉన్న వాళ్లకు ప్రజారోగ్యంపై భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాజమండ్రి కల్తీ పాల ఘటనలో సంభవించిన 11 మరణాలు ప్రభుత్వం చేసిన హత్యలేనని ఆరోపించారు. చనిపోయిన కుటుంబాలకు 25 లక్షల పరిహారం ఇవ్వాలని, చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆమె డిమాండ్ చేవారు. రాష్ట్రంలో పాలు కల్తీ, నెయ్యి కల్తీ, మద్యం కల్తీ, వాగ్దానాలు కల్తీ. మొత్తం పాలనే కల్తీ అని విమర్శించారు. 11 ఏళ్లుగా లైసెన్స్ లేకుండా వరలక్ష్మి డైరీ నడుస్తుంటే చర్యలేవి ? తనిఖీలు ఎక్కడ ? అంటూ ప్రశ్నించారు. ఈ ఘటన యాదృచ్ఛికం కాదు .. పూర్తి నిర్లక్ష్యమని అన్నారు. సైతాన్ సైన్యానికి ఆపద వస్తే తప్పా జగన్ మోహన్ రెడ్డి సైతం బయటకు రారని ఆరోపించారు.

# జగన్‌ది పాలన చెత్త పాలన

**విమర్శలు గుప్పించిన మంత్రి నారాయణ**




**నెల్లూరు, మార్చి 9:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వం చెత్త ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలోని ఐదేళ్లపాటు చెత్తపాలన సాగించారని సెటైర్లు గుప్పించారు. సోమవారంనెల్లూరు జిల్లాలో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీలో కోటి 53లక్షల టన్నుల చెత్త నిల్వలు పేరుకుపోయాయని అన్నారు. మొత్తం చెత్తని క్లియర్ చేయమని సీఎం చంద్రబాబు ఆదేశించారని మంత్రి నారాయణ అన్నారు. ఇప్పటికీ కోటీ 15లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేశామని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 10 వేస్ట్ ఎనర్జీ పవర్ ఎ÷-లాంట్లు మొదలుపెట్టామని.. వాటిలో రెండు పూర్తి చేశామని స్పష్టం చేశారు. జగన్ హయాంలో మిగిలిన వాటిని పూర్తిచేసి ఉంటే, ఈ పరిస్థితి ఉండేది కాదని చెప్పుకొచ్చారు. ఏపీలోని ప్రధాన నగరాల్లో పీపీపీ పద్ధతిలో వేస్ట్ ఎనర్జీ పవర్ ఎ÷-లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# తాళాలు వేసిన ఇంటికి కన్నం

**ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసిన పోలీసులు**



**భీమవరం, మార్చి 9:** తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు సభ్యుల ముఠాను ముదినేపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.45 లక్షలు విలువైన వెండి, బంగారు ఆభరణాలు, వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని కలిదిండి మండలానికి చెందిన నిందితులు గొల్ల వంశీ, కాలదేవి ప్రసాద్‌ను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు జిల్లా ఎస్పీ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్క సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపల్లి ఎస్పీ ముని రాజా, ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

# అస్థిరతలో లెబనాన్

## సార్వత్రిక ఎన్నికలు రెండేళ్ల పాటు వాయిదా

**ఇజ్రాయెల్ - హెజ్బొల్లా యుద్ధం నేపథ్యంలో పార్లమెంట్ కీలక నిర్ణయం**

**సొంత మిత్రుల నుంచే హెజ్బొల్లాకు తప్పని వ్యతిరేకత.. పతనావస్థలో ఉగ్రవాద సంస్థ**



**బీరూట్, మార్చి 9:** తీవ్రమైన అంతర్గత సంక్షోభం మరియు యుద్ధ మేఘాల మధ్య చిక్కుకున్న లెబనాన్ దేశం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది మే నెలలో జరగాల్సిన పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికలను భద్రతా కారణాల దృష్ట్యా మరో రెండేళ్ల పాటు వాయిదా వేస్తున్నట్లు పార్లమెంట్ సోమవారం ప్రకటించింది. ఇజ్రాయెల్ మరియు హెజ్బొల్లా మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు, దేశంలో నెలకొన్న అస్థిరత కారణంగా ఎన్నికల నిర్వహణ అసాధ్యమని ప్రభుత్వం భావించింది. ఇజ్రాయెల్ సైనిక దాడులు మరియు హెజ్బొల్లా ప్రతిదాడుల వల్ల లెబనాన్‌లో భయానక వాతావరణం నెలకొంది. సరిహద్దు ప్రాంతాల్లో నిత్యం బాంబు దాడులు జరుగుతుండటంతో లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఈ యుద్ధ వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తే భారీ ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని, అందుకే ప్రస్తుత పార్లమెంట్ గడువును మరో రెండు సంవత్సరాల పాటు పొడిగిస్తూ చట్టసభ ఆమోదం తెలిపింది.

**హెజ్బొల్లాపై ప్రజాగ్రహం**

గతంలో హెజ్బొల్లాను ఒక నిరోధక శక్తిగా భావించిన లెబనాన్ ప్రజల్లో ఇప్పుడు ఆ సంస్థ పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. హెజ్బొల్లా తన స్వార్థ ప్రయోజనాల కోసం దేశాన్ని అనవసరంగా ఇజ్రాయెల్‌తో యుద్ధంలోకి నెట్టిందని, దీనివల్ల దేశ ఆర్థిక వ్యవస్థ మరియు మౌలిక సదుపాయాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని సామాన్య ప్రజలు మండిపడుతున్నారు. సోషల్ మీడియాలో మరియు వీధుల్లో హెజ్బొల్లాకు వ్యతిరేకంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

**మిత్రుల మద్దతు కోల్పోయిన హెజ్బొల్లా**

రాజకీయంగా కూడా హెజ్బొల్లా ఒంటరిగా మారుతోంది. గత కొంతకాలంగా ఆ సంస్థకు మద్దతుగా ఉన్న పలు రాజకీయ పక్షాలు మరియు మిత్రపక్షాలు ఇప్పుడు దూరమవుతున్నాయి. హెజ్బొల్లా చర్యల వల్ల దేశానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని భావిస్తున్న ప్రభుత్వంలోని కీలక మిత్రులు తమ మద్దతును ఉపసంహరించుకుంటున్నారు. ప్రధానంగా క్రిస్టియన్ మరియు సున్నీ వర్గాలకు చెందిన నాయకులు హెజ్బొల్లా మిలిటరీ కార్యకలాపాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ పరిణామాలు లెబనాన్ భవిష్యత్తును మరింత అయోమయంలోకి నెట్టాయి. ఎన్నికల వాయిదాతో ప్రజాస్వామ్య ప్రక్రియకు ఆటంకం కలిగినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో దేశ భద్రతే ముఖ్యమని పాలకులు భావిస్తున్నారు.